# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

RNI-APTEL/2012/46499

GST No:-37ACDFM5465G1Z1

సంపుటి : 1 సంచిక : 367 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ఎడిటర్ : మహేష్ యాదవ్ 25-12-2025 పేజీలు : 12 వెల రూ.3/






## ఖండాంతర కె-4 క్షిపణి ప్రయోగం సక్సెస్

- సముద్ర గర్భం నుంచి 3,500 కి.మీ. పరిధిలో లక్ష్యాలు ఛేదించే సామర్థ్యం
- ఐఎన్ఎస్ అరిఘాత్ నుంచి ప్రయోగం
- 2.5 టన్నుల వార్‌హెడ్ మోసుకెళ్లే క్షిపణి
- 'అణు త్రయం'లో మరో ముందడుగు

2

## ఆర్టికల్ 370 రద్దుతో శ్యామ్‌ప్రసాద్ కల సాకారం చేశాం: ప్రధాని మోదీ



వివరాలు 2 లో..



- హైకోర్టు పనులు మొదలు
- అమరావతిలో హైకోర్టు నూతన భవన నిర్మాణ పనులకు శ్రీకారం
- 2027 నాటికి నిర్మాణం పూర్తి చేస్తామని మంత్రి నారాయణ వెల్లడి
- మొత్తం 52 కోర్టు హాళ్లు, 21 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం

## రాజధాని నిర్మాణంలో మరో కీలక ఘట్టం..



**అమరావతి**

రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక ముందడుగు పడింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నూతన, శాశ్వత భవన నిర్మాణ పనులను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ ఈరోజు లాంఛనంగా ప్రారంభించారు. 2027 నాటికి ఈ ఐకానిక్ భవనాన్ని పూర్తి చేయడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రాఫ్ట్ ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి మంత్రి నారాయణ పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైకోర్టు భవనాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. రెండు బేస్‌మెంట్ అంతస్తులు, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మరో 7 అంతస్తులతో ఈ నిర్మాణం ఉంటుందని వివరించారు. సుమారు 21 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో, 52 కోర్టు హాళ్లతో ఈ భవనాన్ని డిజైన్ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ భారీ నిర్మాణం కోసం దాదాపు 45 వేల టన్నుల స్టీల్‌ను వినియోగిస్తున్నట్లు చెప్పారు. హైకోర్టు పనులు ప్రారంభం కావడం రాజధాని నిర్మాణంలో ఒక చారిత్రక ఘట్టమని మంత్రి నారాయణ అభివర్ణించారు.ఖ

## ఏపీ వ్యవసాయానికి చేయూతనివ్వండి

- కేంద్రానికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి
- కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- విభజన హామీ మేరకు కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని వినతి
- సూక్ష్మ సేద్యం విస్తరణకు రూ.695 కోట్లు కేటాయించాలని డిమాండ్
- ఏపీని సహజ సాగుకు జాతీయ వనరుల రాష్ట్రంగా ప్రకటించాలని విజ్ఞప్తి



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించాలని సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. అమరావతి పర్యటనలో భాగంగా తనను కలిసిన కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆయన పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని చంద్రబాబు బలంగా కోరారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను

మిగతా 2లో

## మందుబాబులకు సజ్జనార్ హెచ్చరిక

- డ్రంకెన్ డ్రైవ్ లో పట్టుబడితే.. వాహనం సీజ్, రూ. 10 వేల ఫైన్, జైలు శిక్ష, సజ్జనార్ హెచ్చరిక
- న్యూ ఇయర్ సందర్భంగా పార్టీలకు వెళ్లే వాళ్లు డ్రైవర్లను వెంట తీసుకురావాలని సూచన
- సామాన్యులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించవద్దని వార్నింగ్



**హైదరాబాద్**

నగరంలో రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీస్ శాఖ... డ్రంకెన్ డ్రైవ్‌పై ఉక్కుపాదం మోపుతోంది. క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్వయంగా

మిగతా 2లో



## జగన్‌తో ఏం ఒప్పందం జరిగిందో కేసీఆర్ చెప్పాలి..

- కేసీఆర్ కుటుంబం తెలంగాణకు శని: బండి సంజయ్
- కాళేశ్వరం స్కామ్ నుంచి దృష్టి మళ్లించేందుకే కేసీఆర్ కృష్ణా జలాల గురించి మాట్లాడుతున్నారన్న సంజయ్
- ముడుపుల కోసం తెలంగాణను తాకట్టు పెట్టారని మండిపాటు
- రేవంత్ భాష ఆయన్నే నష్టపరుస్తుందని వ్యాఖ్య

2

## మహానగరంలో మత్తు మూకలు!

- రాత్రిళ్లు గంజాయి, మద్యం మత్తులో గుంపులుగా తిరుగుతూ అరాచకాలు
- ఎదురుచెప్పిన స్థానికులపై దాడులు
- వాహనదారులతోనూ కొట్లాటలు
- పోలీసులను లెక్కచేయకుండా వీరంగం
- ప్రభుత్వం చర్యలు చేపడుతున్నా ఆగని గంజాయి రవాణా, వాడకం
- విచ్చలవిడిగా వ్యవహరిస్తున్న యువత రాత్రిళ్లు గస్తీని పెంచిన పోలీసులు



వివరాలు 2 లో..

## స్థానికులకు టీటీడీ గుడ్ న్యూస్.. వైకుంఠ దర్శనంపై కీలక ప్రకటన



2

# జగన్‌తో ఏం ఒప్పందం జరిగిందో కేసీఆర్ చెప్పాలి..

కృష్ణా నదీ జలాల అంశంపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న వ్యాఖ్యలను కేంద్రమంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ తీవ్రంగా ఖండించారు. కాళేశ్వరం ప్రాజెక్టు స్కాం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కేసీఆర్ ఇప్పుడు కృష్ణా జలాల విషయాన్ని తెరపైకి తీసుకొస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ అంశంపై మాట్లాడే నైతిక హక్కు కేసీఆర్‌కు లేదని స్పష్టంగా చెప్పారు. కృష్ణా జలాల పంపకాల్లో తెలంగాణకు జరిగిన నష్టానికి పూర్తిగా కేసీఆర్‌నే బాధ్యుడని వ్యాఖ్యానించారు. కృష్ణా నదీ జలాల పంపకాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను కేసీఆర్ తాకట్టు పెట్టారని బండి సంజయ్ ఆరోపించారు. "కృష్ణా జలాల్లో తెలంగాణకు కేవలం 299 టీఎంసీలకే ఒప్పందం చేసుకున్నారు. 575 టీఎంసీల కోసం పోరాడాల్సిన సందర్భంలో కేసీఆర్ మౌనంగా ఉన్నారు. ముడుపుల కోసమే తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టారు" అని విమర్శించారు. ఈ విషయాలను ఆధారాలతో సహా బయట పెట్టింది తానేనని చెప్పారు. ఏపీ మాజీ సీఎం జగన్‌తో ఏం ఒప్పందం జరిగిందో ప్రజలకు కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పట్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తానే అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరిపించానని బండి సంజయ్ గుర్తు చేశారు. కృష్ణా జలాల అంశంలో కేసీఆర్ పాత్ర పూర్తిగా ద్రోహపూరితమని అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో వెలుగులోకి వస్తున్న అక్రమాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కేసీఆర్ కృష్ణా జలాల అంశాన్ని లేవనెత్తుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం స్కాం నుంచి తప్పించుకునేందుకే కొత్త ఇష్యూ తీసుకొచ్చారని దుయ్యబట్టారు.కేసీఆర్ కుటుంబం మొత్తం తెలంగాణకు భారంగా మారిందని బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "కేసీఆర్ కుమారుడు కేటీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారు. కేసీఆర్ కుటుంబమే తెలంగాణకు పెద్ద శని. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం" అని స్పష్టం చేశారు.

ఇదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యల్ని కూడా బండి సంజయ్ తప్పుబట్టారు. "ఎవరి మీద విమర్శలు చేసినా మాటల తీరులో సంయమనం ఉండాలి. రేవంత్‌రెడ్డి మాట్లాడిన భాష సరైనది కాదు. ఇలాంటి మాటలు చివరకు ఆయన్నే నష్టపరుస్తాయి" అని సూచించారు. హిందూ ధర్మం ప్రతి వ్యక్తి సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటుందని తెలిపారు. గతంలో కేసీఆర్ అనుచితంగా మాట్లాడినప్పుడు తాము ఖండించామని, ఇప్పుడు సీఎం రేవంత్ కూడా తన మాటలపై పునరాలోచన చేసుకోవాలని సూచించారు.

## మందుబాబులకు సజ్జనార్ హెచ్చరిక

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను పర్యవేక్షించారు.నిన్న రాత్రి బంజారాహిల్స్‌లోని టీజీ స్టడీ సర్కిల్ పరిసరాల్లో నిర్వహించిన తనిఖీల్లో సీపీ పాల్గొని, పోలీసు సిబ్బంది పనితీరును పరిశీలించారు. తనిఖీల విధానంపై సూచనలు ఇవ్వడమే కాకుండా, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి స్వయంగా కౌన్సెలింగ్ ఇచ్చారు.డ్రంకెన్ డ్రైవ్ వల్ల కలిగే ప్రమాదాలపై సీపీ సజ్జనార్ వాహనదారులకు స్పష్టంగా వివరించారు. "ప్రతిరోజూ మీడియాలో చెబుతున్నాం. అయినా చదువుకున్న వారు కూడా ఇలా మద్యం తాగి డ్రైవ్ చేస్తే ఎలా?" అని ఆయన ప్రశ్నించారు. నిర్లక్ష్యం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు తెచ్చే ప్రమాదం ఉందని అన్నారు.పబ్‌లు, పార్టీలకు వెళ్లే వారు తప్పనిసరిగా డ్రైవర్లను వెంట తీసుకురావాలని లేదా క్యాబ్‌లు బుక్ చేసుకోవాలని సూచించారు. సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా ప్రవర్తించవద్దని హెచ్చరించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డిసెంబరు 31 రాత్రి వరకు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని సీపీ స్పష్టం చేశారు. నగరవ్యాప్తంగా సుమారు 120 ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తామని వెల్లడించారు.డ్రంకెన్ డ్రైవ్‌పై ఎలాంటి ఉపేక్ష ఉండదని సజ్జనార్ తేల్చిచెప్పారు. అలా పట్టుబడిన వారి వాహనాన్ని సీజ్ చేస్తామని, రూ. 10 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. 6 నెలల జైలు శిక్ష కూడా తప్పదని స్పష్టం చేశారు. సేవించిన మద్యం మోతాదును బట్టి శాశ్వతంగా లైసెన్స్ రద్దుకు రవాణా శాఖకు సిఫారసు చేస్తామని తెలిపారు.

## మహానగరంలో మత్తు మూకలు!

**హైదరాబాద్ సిటీ, డిసెంబరు 25**

మహానగరంలో 'మత్తు' మూకలు చెలరేగిపోతున్నాయి. గంజాయి రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నా, స్మగ్లర్లను కటకటాల్లోకి నెడుతున్నా.. గంజాయి రవాణా, వినియోగం ఆగడం లేదు. 20 ఏళ్లుకూడా లేని యువకులు గంజాయి, ఇతర చెడు వ్యసనాలకు బానిసై, పోకిరీ చేష్టలకు దిగుతున్నారు. కత్తులు, బ్లేడ్‌లు, నకిలీ తుపాకులతో తిరుగుతూ హల్‌చల్ చేస్తున్నారు. గంజాయి, మద్యం మత్తులో రాత్రిళ్లు రోడ్లపై తిరుగుతూ.. చిన్న చిన్న విషయాలకే స్థానికులపై, వాహనదారులపై గొడవలకు దిగి, దాడులకు పాల్పడుతున్నారు. పోలీసులను సైతం లెక్క చేయకుండా వీరంగం సృష్టిస్తున్నారు. పలు ప్రాంతాల్లో రాత్రిళ్లు కొట్లాటలు, గొడవలు, హత్యాయత్నాలు, హత్యలు తరచూ జరుగుతున్నాయి. ఇటీవల హైదరాబాద్ నగరవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు పెరిగిపోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో పోలీసులు పలు ప్రాంతాల్లో రాత్రిపూట పెట్రోలింగ్‌ను ఉధృతం చేశారు. ఎలాంటి కారణం లేకుండా బయట తిరుగుతున్న వారిని గుర్తించి, తీవ్రంగా హెచ్చరించి వదిలేస్తున్నారు.ఇటీవల అంబర్‌పేటలో అర్ధరాత్రి ఓ యువకుడిపై పోకిరీలు అకారణంగా రాడ్లు, కర్రలతో దాడి చేసి కొట్టారు. తీవ్ర గాయాలపాలైన యువకుడిని వెంటనే ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో పోలీసులు రంగంలోకి దిగి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.ఓ బాలింతను ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకెళ్తున్న అంబులెన్సుకు వనస్థలిపురంలో రోడ్డుమీద గంజాయి మత్తులో తిరుగుతున్న పోకిరీ గ్యాంగ్ అడ్డుగా వచ్చింది. పక్కకు తప్పుకొని దారి ఇవ్వాలని అంబులెన్స్ డ్రైవర్ అన్నందుకు వాళ్లు అంబులెన్స్‌ను రోడ్డుపైనే ఆపేసి డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డారు. వారిని వారించేందుకు ప్రయత్నించిన ఓ సెక్యూరిటీ గార్డుపై విచక్షణారహితంగా దాడి చేశారు.

కేపీహెచ్‌బీ హైదర్‌నగర్ పరిధిలో ఒక వ్యక్తిపై ఓ పార్టీకి చెందిన స్థానిక నేతలు మద్యం మత్తులో దాడికి పాల్పడి తీవ్రంగా గాయపర్చారు.కేపీహెచ్‌బీ కాలనీ పరిధిలో ఇంటి ముందు బైకులు పార్క్ చేయవద్దన్నందుకు దంపతులపై పోకిరీల గుంపు తీవ్రంగా దాడికి పాల్పడటం కలకలం సృష్టించింది.

కొన్నిరోజుల క్రితం జీడిమెట్లలో అర్ధరాత్రి గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. గంజాయి విక్రేతలు తమను పట్టుకునేందుకు వచ్చిన ఎక్సైజ్ అధికారుల ముందే.. ఓ యువకుడిని బ్లేడ్లతో విచక్షణారహితంగా గాయపరిచి పారిపోయారు.

ఇటీవల మూసాపేటలో ఓ యువకుడు గంజాయి మత్తులోనడిరోడ్డుపై హల్‌చల్ చేశాడు. ఓ కారును అడ్డగించి, దానిపై ఎక్కి కూర్చున్నాడు. కారులోని వారిని బలవంతంగా కిందకు దింపి దాడికి ప్రయత్నించాడు. సమీపంలోని పోలీసులు అక్కడికి చేరుకుని, పోకిరీని అదుపులోకి తీసుకున్నారు.

రామంతపూర్‌లో ఓ యువకుడు అర్ధరాత్రి గంజాయి మత్తులో కత్తితో తిరుగుతూ.. రోడ్డుపై వెళుతున్నవారిని తిడుతూ, దాడులకు ప్రయత్నించాడు.

ఇటీవల అల్లాపూర్‌లో ఒక చికెన్ షాపు యజమానిపై అల్లరిమూక దాడికి పాల్పడింది. దుకాణం ముందు సిగరెట్టు తాగొద్దన్నందుకు దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు.

కంచన్‌బాగ్ పరిధిలో కిరాణా దుకాణం యజమానిపై పక్కనే ఉన్న పాన్‌షాపు నిర్వాహకుడు, అతడి గ్యాంగ్ దాడికి పాల్పడింది. తీవ్ర గాయాలపాలైన బాధితుడు చికిత్స పొందుతూ మరణించారు.

సైబరాబాద్ పరిధిలోని షాబాద్‌లో వైన్‌షాపులో చోరీకి ప్రయత్నిస్తున్న దొంగను వాచ్‌మన్ అడ్డుకున్నాడు. మత్తులో ఉన్న ఆ దొంగ వాచ్‌మన్ తలపై పారతో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

## స్థానికులకు టీటీడీ గుడ్ న్యూస్.. వైకుంఠ దర్శనంపై కీలక ప్రకటన

**వైకుంఠ ద్వార దర్శనానికి స్థానికులకు ప్రత్యేక కోటా**

**తిరుమల, తిరుపతి వాసులకు రోజుకు 5,000 టోకెన్లు**

**నేటి నుంచి ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నమోదుకు అవకాశం**

**ఈ-డిప్ విధానంలో 29న టోకెన్ల కేటాయింపు**

**తిరుమల**

తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనాల కోసం ఎదురుచూస్తున్న స్థానిక భక్తులకు టీటీడీ శుభవార్త చెప్పింది. తిరుమల, తిరుపతి, రేణిగుంట, చంద్రగిరి ప్రాంతాల వారికి ప్రత్యేక కోటా కింద దర్శన టోకెన్లు జారీ చేయనున్నట్లు ప్రకటించింది. జనవరి 6, 7, 8 తేదీల్లో దర్శనం కోసం రోజుకు 5,000 చొప్పున టోకెన్లు కేటాయించనుంది.ఈ టోకెన్ల కోసం ఆసక్తి ఉన్న స్థానికులు నేటి నుంచి ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ వివరాలు నమోదు చేసుకోవాలి. టీటీడీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ లేదా వాట్సాప్ ద్వారా 1o3 విధానంలో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. తిరుపతి, రేణిగుంట, చంద్రగిరి వాసులకు రోజుకు 4,500 టోకెన్లు, తిరుమలలో నివసించేవారికి 500 టోకెన్లు కేటాయిస్తారు. నమోదు చేసుకున్న వారిలో నుంచి 'ఈ-డిప్' పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసి, ఈ నెల 29న మధ్యాహ్నం 2 గంటలకు వివరాలు ప్రకటిస్తారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీటీడీ సూచించింది.

ఇదిలా ఉంటే.. తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో జనవరి, ఫిబ్రవరి నెలల్లో జరగనున్న విశేష ఉత్సవాల వివరాలను టీటీడీ వెల్లడించింది. జనవరి 3న పౌర్ణమి గరుడసేవ, 14న భోగి తేరు, 16న గోదా కల్యాణం, 17న పార్వేటి ఉత్సవం, 25న రథసప్తమి, జనవరి 27 నుంచి ఫిబ్రవరి 1 వరకు తెప్పోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు.

## ఏపీలో భారీ బొగ్గు నిక్షేపాలు..

**60 ఏళ్లకు సరిపడా విద్యుత్ ఉత్పత్తికి అవకాశం!**

**దేశ బొగ్గు ఉత్పత్తి చిత్రపటంలోకి చేరనున్న ఏపీ**

**ఏలూరు జిల్లా రేచర్ల బ్లాక్‌లో త్వరలో బొగ్గు తవ్వకాలు**

**బిడ్లు దాఖలు చేసిన రిలయన్స్, యాక్సిస్ ఎనర్జీ సంస్థలు**

**60 ఏళ్ల పాటు 8,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం**

ఏపీ త్వరలో దేశ బొగ్గు ఉత్పత్తి చిత్రపటంలో స్థానం సంపాదించనుంది. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం పరిధిలోని రేచర్ల బ్లాకులో బొగ్గు తవ్వకాలు ప్రారంభించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ బ్లాకులో బొగ్గు వెలికితీత, గ్యాసిఫికేషన్ కోసం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు హైదరాబాద్‌కు చెందిన యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా సంస్థలు బిడ్లు దాఖలు చేశాయి.

దేశవ్యాప్తంగా మొత్తం 41 బొగ్గు బ్లాకుల్లో ఉత్పత్తి లేదా గ్యాసిఫికేషన్ చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది అక్టోబరులో బిడ్లను ఆహ్వానించింది. ఇందులో భాగంగా ఈ రెండు కంపెనీలు సంయుక్తంగా 17 బ్లాకుల కోసం బిడ్లు సమర్పించాయి. అందులో ఏపీలోని రేచర్ల బ్లాక్ కూడా ఒకటి కావడం గమనార్హం.

**రేచర్ల బ్లాక్ ప్రాధాన్యత**

ఏలూరు జిల్లాలోని ఈ రేచర్ల బ్లాకులో అత్యంత నాణ్యమైన గ్రేడ్-1 బొగ్గు నిక్షేపాలు భారీ స్థాయిలో ఉన్నాయని అంచనా వేస్తున్నారు. ఇక్కడ సుమారు 200 నుంచి 300 కోట్ల టన్నుల బొగ్గు అందుబాటులో ఉంటుందని భావిస్తున్నారు. ఈ నిక్షేపాల ద్వారా ఏటా 8,000 మెగావాట్ల విద్యుత్‌ను దాదాపు 60 సంవత్సరాల పాటు నిరంతరాయంగా ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ తవ్వకాలు ప్రారంభమైతే రాష్ట్ర ఇంధన అవసరాలకు ఇది కీలకంగా మారనుంది.

## ఏపీ వ్యవసాయానికి చేయూతనివ్వండి

మొదటిపేజీ తరువాయి

చంద్రబాబు వివరించారు. పంచ సూత్రాల ప్రణాళికతో వ్యవసాయంలో 10.70 శాతం వృద్ధి సాధించామని తెలిపారు. నీటి భద్రత, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి అంశాలపై దృష్టి సారించినట్లు చెప్పారు.

**ముఖ్యమంత్రి చేసిన ప్రధాన విజ్ఞప్తులు**

రాష్ట్ర వ్యవసాయ రంగం బలోపేతానికి సీఎం చంద్రబాబు పలు కీలక ప్రతిపాదనలను కేంద్ర మంత్రి ముందుంచారు. పీఎం కృషి సిచాయి యోజన కింద సూక్ష్మ సాగునీటి విస్తరణకు అదనంగా రూ.695 కోట్లు కేటాయించాలని కోరారు. రూ.200 కోట్ల అంచనాతో కొబ్బరి పార్క్, అత్యాధునిక ఆక్వా ల్యాబ్, రాష్ట్రంలో మామిడి రైతుల కోసం ప్రత్యేకంగా మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.వీటితో పాటు ఏపీని సహజ సాగుకు 'జాతీయ వనరుల రాష్ట్రం'గా ప్రకటించాలని, రాబోయే ఐదేళ్లలో 20,000 అదనపు సహజ సాగు క్లస్టర్లను మంజూరు చేయాలని కోరారు. పులికాట్ సరస్సు అభివృద్ధికి నిధులు, ఆహార శుద్ధి ఇంక్యుబేషన్ సెంటర్లు, పొగాకు సేకరణకు ఆర్థిక సాయం వంటి అనేక అంశాలను వినతిపత్రంలో పొందుపరిచారు.

## ఖండాంతర కె-4 క్షిపణి ప్రయోగం సక్సెస్

**న్యూఢిల్లీ, డిసెంబరు 25:**

వ్యూహాత్మక రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా మనదేశం కీలక క్షిపణి పరీక్షను నిర్వహించింది. అణు సామర్థ్య జలాంతర్గామి నుంచి బంగాళాఖాతంలో మధ్యస్థ స్థాయి ఖండాంతర క్షిపణిని పరీక్షించి మన అణు శక్తిని ప్రపంచానికి చాటింది. మంగళవారం విశాఖపట్నం తీరంలో ఐఎన్ఎస్ అరిఘాత్ జలాంతర్గామి నుంచి కె-4 క్షిపణి ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించారు. 3,500 కి.మీ. పరిధిలోని లక్ష్యాలను ఛేదించడానికి రూపొందించిన ఈ క్షిపణితో భారత్ సముద్ర ఆధార అణు శక్తికి మరింత బలం చేకూరనుంది. కె-4 జలాంతర్గామి నుంచి ప్రయోగించే ఖంతాంతర క్షిపణి (ఎస్ఎల్‌బీఎం)తో భూ ఉపరితలం, గగనతలం, సముద్రగర్భం నుంచి అణు దాడుల సామర్థ్యం ఉన్న దేశాల సరసన భారత్ చేరింది. మూడు రకాలుగా రహస్య దాడులు చేసే మన దేశ అణ్వాయుధ త్రయంలో కె-4 క్షిపణులు కీలక పాత్ర పోషిస్తాయి. అణు దాడుల నిరోధక గస్తీ కోసం సముద్రంలో రహస్యంగా, నిశ్శబ్దంగా సుదీర్ఘకాలం పాటు సంచరించే అరిహంత్ తరగతి జలాంతర్గాముల కోసం వీటిని రూపొందించారు. భూ ఉపరితం నుంచి దాడులు చేసే అగ్ని-3 క్షిపణి నుంచి దేశంలోనే అత్యధిక దూరంలోని లక్ష్యాలను ఛేదించే సముద్ర ఆధార కె-4 క్షిపణిని అభివృద్ధి చేశారు. ఈ క్షిపణి 2.5 టన్నుల అణు వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదు.

**కె-4 అంటే ఇది..**

మధ్యస్థ స్థాయి, ఘన ఇంధన జలాంతర్గామి నుంచి ప్రయోగించే ఖండాంతర క్షిపణి కె-4. ఈ క్షిపణుల సిరీసలో 'కె' అనే అక్షరాన్ని ఏపీజే అబ్దుల్ కలామ్ స్మృత్యర్థం పెట్టారు. దీనిని డీఆర్‌డీవో అభివృద్ధి చేయగా, క్షిపణులను భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) తయారు చేస్తోంది. ఈ క్షిపణిని అరిహంత్ తరగతి ఐఎన్ఎస్ అరిహంత్, ఐఎన్ఎస్ అరిఘాత్ వంటి జలాంతర్గాముల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేశారు. ఈ క్షిపణితో సముద్రంలో మన యుద్ధ సామర్థ్యం గణనీయంగా పెరుగుతుంది. అంతకుముందు 700 కి.మీ పరిధి మాత్రమేగల కె-15 (సాగరిక)పైనే ఆధార పడేవారు. 10 నుంచి 12 మీటర్ల పొడవుండే కె-4 క్షిపణి 17 నుంచి 20 టన్నుల వరకు బరువు ఉంటుంది. రెండు దశల స్థిర రాకెట్ మోటార్‌తో పనిచేస్తుంది. ఈ క్షిపణి నావిగేషన్ కోసం జీఎన్ఎసఎసతో పాటు నావిక్‌పై ఆధారపడుతుంది.

**వ్యూహాత్మకంగా చాలా కీలకం**

తాజా కె-4 పరీక్ష మన దేశానికి వ్యూహాత్మకంగా చాలా కీలకమైనది. త్వరలోనే జలాంతర్గాముల అమ్ములపొదిలో చేరే ఈ క్షిపణితో అణుదాడుల నిరోధక సామర్థ్యం మరింత పెరుగుతుంది. తొలిగా అణుదాడుల చేయబోమన్న దానికి కట్టుబడి, శత్రుదేశాలు చేసే దాడులను సమర్థంగా తిప్పికొట్టగలిగే రెండో దాడికి ఈ క్షిపణులు ఎంతో ఉపయోగపడతాయి. దీని సుదీర్ఘ రేంజ్‌తో హిందూ మహాసముద్రంలో వ్యూహాత్మక స్థిరత్వం, దాడుల నిరోధ శక్తి పెరుగుతుంది. హిందూ మహాసముద్రంలో చైనా తన శక్తిని పెంచుకోవడం, ఫసిఫిక్ జలాల్లో అమెరికా ప్రభావం నేపథ్యంలో కె-4 వంటి క్షిపణులు శత్రు దాడులను తిప్పికొట్టడమే కాకుండా, ప్రాంతీయ భయాలు పెరగకుండా అదుపులో ఉంచగలుగుతాయని రక్షణ సిబ్బంది చెప్పారు.

## ఆర్టికల్ 370 రద్దుతో శ్యామ్‌ప్రసాద్ కల సాకారం చేశాం

ఆర్టికల్ 370 రద్దుతో శ్యామ్‌ప్రసాద్ కల సాకారం చేశామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. జమ్మూకాశ్మీర్‌లో భారత రాజ్యాంగం అమలు చేశామని చెప్పారు. గురువారం ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నోలో జరిగిన భారతరత్న, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి 101వ జయంతి కార్యక్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ మధ్యాహ్నం సుమారు 2:30 గంటలకు ఆయన గోమ్తీ నది ఒడ్డున నిర్మించిన రాష్ట్ర ప్రేరణా స్థల్‌ను జాతికి అంకితం చేశారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. 'కోట్లాదిమందిని పేదరికం నుంచి విముక్తి చేశాం. గతంలో ఒకే కుటుంబం పేరుతో పథకాలు అమలుచేశారు. వాజ్‌పేయి హయాంలోనే గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి బీజం పడింది. 2014 నుంచి గ్రామాల్లో 4 లక్షల కి.మీ. రోడ్ల నిర్మాణం జరిగింది. దేశంలో ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణం మరింత పుంజుకుంది. వాజ్‌పేయి హయాంలోనే ఢిల్లీ మెట్రో ప్రారంభమైంది. భవిష్యత్‌లో అతిపెద్ద మొబైల్ ఫోన్ల ఉత్పత్తి దేశంగా భారత్ మారనుంది. అందరి కృషితోనే వికసిత్ భారత్ సాకారం అవుతుంది. లక్నోలో అతిపెద్ద డిఫెన్స్ కారిడార్ ఉంది.బ్రహ్మోస్ క్షిపణులు లక్నోలోనే తయారవుతున్నాయి. మన బ్రహ్మోస్ క్షిపణుల సామర్థ్యం ప్రపంచమంతా చూసింది. మొబైల్, ఇంటర్నెట్ వినియోగించే దేశాల్లో భారత్‌దే అగ్రస్థానం' అని అన్నారు. కాగా, సుమారు 65 ఎకరాల విస్తీర్ణంలో 230 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మితమైన రాష్ట్ర ప్రేరణా స్థల్ జాతీయ స్మారక సముదాయంలో అటల్ బిహారీ వాజ్‌పేయితో పాటు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయల ఆదర్శాలకు అనుగుణంగా వారి విగ్రహాలు ఏర్పాటు చేశారు.

## నంద్యాల హోలీ క్రాస్ కేథడ్రల్‌లో

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు

– ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్.
– ప్రేమ, శాంతి మార్గంలో పయనించాలని పిలుపు.





**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో :** నంద్యాల పట్టణంలోని చర్చి ఆఫ్ సౌత్ ఇండియా (సిఎస్ఐ) నంద్యాల డయాసిస్ పరిధిలోని హెూలీ క్రాస్ కేథడ్రల్ మరియు హెూలీ క్రాస్ సెంటెనరీ చర్చి (పెద్ద చర్చి) నందు క్రిస్మస్ పర్వదిన వేడుకలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం అక్కడ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు . అలాగే మంత్రి ఫరూక్ గారు చర్చి ప్రాంగణంలో కేక్ కట్ చేసి, క్రైస్తవ సోదర సోదరీ మణుల ందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ ఎండి ఫరూక్ మాట్లాడుతూ లోక రక్షకుడు జన్మించిన ఈ రోజున శాంతి, ప్రేమ, కరుణ అనే సందేశం సమా జంలోని ప్రతి ఒక్కరికీ చేరాలని ఆకా ంక్షించారు. సమాజంలో అన్ని మతాల వారు సోదరభావంతో మెలగాలని, మత సామరస్యం దేశానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం క్రైస్తవ మరియు మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందని, వారి అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ కొత్తమాసి జోసెఫ్, రెవరెండ్ పాల్ రాజారావు, రెవరెండ్ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్, సిఎస్ఐ డయాసిస్ సెక్రటరీ బి. ప్రభుదాస్, అసిస్టెంట్ సెక్రటరీ స్టీవెన్, మాజీ కౌన్సిలర్ మన్నె కృపాకర్, 33వ వార్డు ఇంచార్జ్ జోసెఫ్, 26వ వార్డు టిడిపి ముఖ్య నాయకులు మల్లెల భాస్కర్, మాజీ కౌన్సిలర్ కొండారెడ్డి, జార్జ్, శరత్, దివాకర్, సందీప్, దేవరాజ్ మరియు పెద్ద సంఖ్యలో క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

– ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి





**మహానంది, పల్లె వెలుగు :** గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మహానంది మండలం మసీదుపురం గ్రామంలో రూ.90 లక్షల నాబార్డు నిధులతో నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ నరాల చంద్రమౌలిశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ నరాల జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా నాయకులు గజమాలతో స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కేసీ కెనాల్ ప్రాజెక్టు ఛైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి, కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## హోసన్నా ప్రార్థన మందిరంలో జరిగిన క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్





**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో :** నంద్యాల పట్టణంలోని రాయల్ కాంపౌండ్ లో ఉన్న హెూసన్నా ప్రార్థన మందిరం నందు పాస్టర్ అనిల్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ముందుగా క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. లోకరక్షకుడు జన్మించిన ఈ పవిత్ర దినం అందరి జీవితాల్లో సుఖశాంతులు నింపాలని ఆయన ఆకాంక్షించారు. క్రిస్టియన్స్ సంక్షేమం కోసం ప్రభుత్వం నుండి మరిన్ని పథకాలు సహకారం అందేలా చూస్తామన్నారు. అనంతరం హెూసన్న మందిర నిర్వాహకులు ఏర్పాటు చేసిన క్రిస్మస్ కేకును మంత్రి ఫరూక్ కట్ చేసి సంబరాలను ప్రారంభించారు. ప్రభుత్వం అన్ని మతాల సంక్షేమానికి కట్టుబడి ఉందని, క్రిస్టియన్స్ అభివృద్ధికి తమ శాఖ ద్వారా నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మన్నె కృపాకర్, 33వ వార్డు టీడీపీ ఇంచార్జ్ జోసెఫ్, 26వ వార్డు టిడిపి ముఖ్య నాయకులు మల్లెల భాస్కర్, మాజీ కౌన్సిలర్ కొండారెడ్డి, జార్జ్, శరత్, దివాకర్, సందీప్, దేవరాజ్, జనసేన పబ్బతి రవి , మిద్దె ఉసేని , ఓబులేష్ మరియు పెద్ద సంఖ్యలో క్రైస్తవ సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

## ప్రతిభతోనే విద్యార్థులకు గుర్తింపు



**మహానంది, పల్లె వెలుగు :** మహానంది మండలం గాజులపల్లె మెట్టలోని మస్జిద్ రహ్మతులిల్ ఆలమిన్ ఆధ్వర్యంలో హాదియా మకాతిబ్ నిర్వహించారు. గురువారం మదరస విద్యార్థిని, విద్యార్థుల చేత పవిత్ర గ్రంథం ఖురాన్ లోని హదీసులు, ఆయతులు, కార్యాచరణ మౌఖీక కార్యక్రమాలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మౌలానలు ఫీర్దోస్,కరిముల్లా, ఉమ్మర్ రషాది, ముస్లిం పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి





**ఎమ్మిగనూరు పల్లె వెలుగు డిసెంబర్ 25 :** ఎమ్మిగనూరులో సి ఎస్ ఐ చర్చ్ ఎంబి చర్చును ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి సందర్శించి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రేమ, క్షమ, శాంతి మరియు మానవత్వ సందేశాన్ని ప్రపంచానికి అందించిన యేసు క్రీస్తు బోధనలు సమాజంలో మరింత విస్తరించాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చర్చ్ ఫాదర్స్, సంఘ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.





## శ్రీ కొత్తూరు సుబ్బరాయుని దేవస్థానంలో ఆర్డీఓ పూజలు

– ఆలయ ఈవో యం.రామక్రిష్ణ



**పాణ్యం. ఎస్.కొత్తూరు. డిసెంబర్ 25 . (పల్లె వెలుగు ):** పాణ్యం మండలంలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఆలయ ఈవో యం.రామక్రిష్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కె.పి. నరసింహ్మలు గురువారం పూజలు నిర్వ హించారు. ఈ సందర్భముగా ఆలయ ప్రధాన అర్చకులు, నారాయణ స్వామి, క్రిష్ణయ్య స్వామి అధికారసిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీస్వామి వారికి అభిషేకములు, అర్చనలు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వ మండపము నందు పూలమాలలు,స్వామివారి రక్ష, శేష వస్త్రముల తో ఘనంగా సత్కరించారు. స్వామీ వారి ప్రతిమను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో యం.రామక్రిష్ణ, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా క్రిస్మస్ వేడుకలు





**పల్లె వెలుగు నంద్యాల రూరల్ :** నంద్యాల టౌన్ స్థానిక అబాండం తాండ కేసి కెనాల్ కట్ట సమీపంలో గల జిప్సీ మినిస్ట్రీస్ ప్రార్థన మందిరం నందు ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ పెద్ద సొమ్లనాయక్ క్రీస్తు జననం గురించి బోధించారు. అనంతరం కేక్ కట్ చేసి చేరి వచ్చిన అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిప్సీ మినిస్ట్రీస్ చర్చి పెద్దలు అందరు కలిసి పాస్టర్ దంపతులను సన్మానించారు. అనంతరం పిల్లలు నాట్యాలతో అందరిని ఆకర్షింపచేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ టీడీపీ ఇంచార్జ్ తాటికొండ బుగ్గరాముడు, బాల నాయక్, ఆదాం,దుర్గ ప్రసాద్, లాజర్,మహేష్ బాబు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నంద్యాల సెయింట్ మాథ్యూస్ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

## - ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్





**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో :** నంద్యాల పట్టణం జ్ఞానాపురంలోని సి.ఎస్.ఐ. సెయింట్ మాథ్యూస్ చర్చి (ఫాస్ట్రేట్ -3) నందు క్రిస్మస్ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చర్చి ప్రాంగణంలో మంత్రి ఫరూక్ కి క్రైస్తవ పెద్దలు, సంఘ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి ఫరూక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రేమ, కరుణ, శాంతి అనే సుగుణాలను చాటిచెప్పిన ఏసుక్రీస్తు జన్మదినం మానవాళికే పండుగ రోజని మంత్రి కొనియాడారు. నంద్యాల జిల్లా మత సామరస్యానికి ప్రతీక అని, ఇక్కడ అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో పండుగలు జరుపుకోవడం సంతోషదాయకమని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మన్నె కృపాకర్, 33వ వార్డు టీడీపీ ఇంచార్జ్ జోసెఫ్, 26వ వార్డు టిడిపి ముఖ్య నాయకులు మల్లెల భాస్కర్, మాజీ కౌన్సిలర్ కొండారెడ్డి, జార్జ్, శరత్, దివాకర్, సందీప్, దేవరాజ్, ఓబులేష్ మరియు పెద్ద సంఖ్యలో క్రైస్తవ సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

# ఘనంగా వాజ్‌పేయి జయంతి వేడుకలు



**హొళగుంద పల్లె వెలుగు డిసెంబర్ 25 :** మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి జన్మదిన వేడుకలను హొళగుందలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బిజెపి రాష్ట్ర కౌన్సిలింగ్ నెంబర్ చిదానంద, హొలగుంద సింగల్ విండో డైరెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ రెండు సార్లు దేశంలో అధికారంలోకి వచ్చామంటే వాజ్‌పేయి నేర్పిన సిద్దాంతాలే అన్నారు. పల్లెలు పట్టణాలు రోడ్డు, రైల్వే కనెక్టివిటీ పెంచారని, ఒక్క ఓటుతో అధికారం కోల్పోతామని తెలిసి కూడా వెనక్కి వెళ్ళలేదన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు వాజ్‌పేయి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కాశీ విశ్వనాథ్ గౌడ్ , జనరల్ సెక్రెటరీ ఉల్లిగన్న , మహేష్ , బిశ్వాస్,తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లా రైలు ప్రయాణికులకు శుభవార్త

## - ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.



**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో :** నంద్యాల జిల్లా రైలు ప్రయాణికులకు కేంద్ర రైల్వే శాఖ మరో శుభ వార్త అందించిందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి గురువారం తెలిపారు. ప్రస్తుతం నంద్యాల మీదుగా నడుస్తున్న ట్రైన్ డోన్ బి గుంటూరు ట్రైన్ (17227/28) ను రెండువైపుల పొడి%ఎ%గించడమైనదని తెలిపారు.ఈ ట్రైన్ ధర్మవరంలో ప్రారంభం అయ్యి అనంతపూరం, గుత్తి , గుంతకల్లు, డోన్ , నంద్యాల , గుంటూరు, విజయవాడ, నర్సాపూర్ వరకు ప్రయాణిస్తుందన్నారు.ఈ ట్రైన్ నెంబరు 17282/81 గా మార్పు చేశారని అన్నారు.ఈ ట్రైన్ ధర్మవరంలో తెల్ల వారుజామున 4:30 గంటలకు ప్రారంభం అయ్యి నంద్యాలజిల్లా డోన్ కు ఉదయం 8:15 కు చేరుకొని , నంద్యాలకు 10:30 కు చేరుకుంటుందని, గుంటూరుకు 4:15 కి చేరుకొని విజయవాడకు సాయంత్రం 6:00 గంటలకు చేరుకొని , నర్సాపూర్ కు రాత్రి 8:30 కి చేరుకుంటుందనీ అన్నారు.తిరుగు ప్రయాణంలో నర్సాపూర్ లో ఉదయం 6:15 కు ప్రారంభం అయ్యి, విజయవాడకు 10:00 గంటలకు , గుంటూరు 12:00 గంటలకు , నంద్యాలకు సాయంత్రం 6:00 గంటలకు, డోన్ కు 8:00 గంటలకు, గుంతకల్ కి రాత్రి 10:00 గంటలకు , ధర్మవరం కు అర్ధరాత్రి 12:30 కు చేరుకుంటుందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు. విజయవాడలో 04-10-2024 న పార్లమెంట్ సభ్యులతో దక్షిణ మధ్య రైల్వే శాఖ ఉన్నతాధికారుల సమావేశంలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి విన్నపాన్ని కేంద్ర రైల్వే బోర్డు ఆమోదం తెలిపి ఈ రైలు నంద్యాలకు పగటి పూట నడిచేలా చర్యలు తీసుకున్నట్లు దక్షిణ మధ్య రైల్వే శాఖ ఓ ప్రకటనలో తెలిపినట్లు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

# అటవీ శాఖ అధీనంలో ప్రోక్ లైనర్లు

## - ఇరుక్కుపోయిన మట్టి మాఫియా



**బండి ఆత్మకూరు పల్లె వెలుగు డిసెంబర్ 25:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఈర్నపాడు గ్రామానికి సమీపంలోని అటవీ భూములలోని మట్టిని యదేచ్ఛగా తరలించుకొని పోతూ ఉన్న మట్టి మాఫియా చేతిలో ఇరుక్కొని పోయింది. గత రెండు రోజులుగా ఈ ప్రాంతంలో మట్టి మాఫియా దార్లు అక్రమ మార్గాల్లో జెసిబి ప్రొక్ లైనర్ల ద్వారా మట్టిని తరలిస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో అటవీ అధికారులు మంగళవారం నాడు సంఘటన స్థలానికి చేరుకొని ఒక ప్రోక్లైనను ఓంకారం బేస్ క్యాంపుకు తరలించడం జరిగింది. మరో ప్రోక్లైనర్ సంఘటన స్థలంలో మట్టి మాఫియా వదిలిపోయింది. దీంతో అటవీ శాఖ సిబ్బంది బుధవారం రాత్రి అంతా ప్రోక్లైన్ వద్ద కాపలాకాశారు. తిరిగి గురువారం ఉదయం నాటి నుండి కూడా అటవీ సిబ్బంది ప్రోక్ లైనర్ వద్ద నిఘా ఉంచారు. అక్రమంగా మట్టిని తరలించిన నేరానికి రాయల్టీ చెల్లిస్తానని మట్టి మాఫియా కు చెందిన వ్యక్తి కొందరు దళారులతో బేరసారాలు నిర్వహించడం జరిగింది. ఈ విషయంపై బే రసారాల వ్యవహారం బెడిసి కొట్టింది. గత రెండు రోజులుగా మట్టి మాఫియా రెండు జెసిబి ల ద్వారా నాలుగు టిప్పర్లు ఏర్పాటు చేసి మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటూ ఉన్నారు. నాణ్యతను బట్టి వేల రూపాయల్లో మట్టిని అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఊహించని రీతిలో అటవీశాఖ అధికారులు జెసిబిలను స్వాధీనం చేసుకోవడంతో మట్టి మాఫియా దారులు అటవీ శాఖ కనుసనల్లో పడి నలిగిపోతూ ఉన్నారు. అక్రమంగా మట్టిని తరలించిన నేరానికి అటవీశాఖ చట్టాల ప్రకారం ఆ శాఖకు చెందిన అధికారులు కేసులు నమోదు చేసే ప్రయత్నంలో ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈర్ణపాడు అటవీ భూములతో పాటు తెలుగు ప్రధాన కాలువకు సమీపంలోనే త్రవ్వకాలను నిర్వహించి మట్టిని తరలించారు. ఈ విషయంపై ఆ శాఖకు చెందిన అధికారి ఒకరు ఇక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. కాలువకు ఆనుకొని మట్టిని తవ్వడం వల్ల భవిష్యత్తులో ప్రధాన కాలువ దెబ్బతినే పరిస్థితులు ఏర్పడవచ్చునని ఈ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనపై తెలుగు గంగ శాఖకు చెందిన అధికారులు ఎవరూ కూడా గురువారం సాయంత్రం నాటి కూడా ఇటువైపే రాకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది.

# దేశ గౌరవాన్ని ప్రపంచ వేదికపై నిలబెట్టిన మహానేత వాజ్పేయి : బూసి రెడ్డి



**శిరివెళ్ల (పల్లె వెలుగు) :** సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో దేశ గౌరవాన్ని ప్రపంచ వేదికపై మరింత ఉన్నతంగా నిలబెట్టిన భారతరత్న, మహానేత, మాజీ ప్రధానమంత్రి శ్రీ అటల్ బిహారి వాజ్‌పేయి అని నీటి సంఘం వైస్ చైర్మన్ బుసిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్పేయి గారి జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఆ మహనీయునికి బూసి రెడ్డి ఘన నివాళులు. అర్పించారు. భారతదేశ ప్రధానిగా వాజ్పేయి అందిం చిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో శేష ఓబుల్ రెడ్డి, సుబ్బారావు, చిన్న సర్వయ్య, భాష తదితరులుపాల్గొన్నారు.

# క్రైస్తవ సమాజానికి అత్యంత పవిత్రమైన క్రిస్మస్ పండుగ









**ఎమ్మిగనూరు పల్లె వెలుగు డిసెంబర్ 25 :** మానవాళికి శాంతి, క్షమ, సేవా భావాన్ని బోధించిన ఏసుక్రీస్తు ప్రభువు జన్మదినాన్ని స్థానికులు భక్తిశ్రద్ధలతో, ఆనందకరంగా ఆచరించారు.ఈ సందర్భంగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ ఎంపీ బుట్టా రేణుక భర్త, పార్టీ సీనియర్ నాయకులు బుట్టా శివ నీలకంఠ పట్టణంలోని 9వ వార్డులోని ఆర్.సి.యం చర్చ్ నకు వెళ్లి క్రైస్తవ సోదర-సోదరీమణులతో కలసి క్రిస్మస్ మహోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. చర్చిలో స్థానిక భక్తులతో కలసి ప్రార్థనలు, ప్రార్థనా సేవలు, శాంతి సందేశం పంచుకున్నారు. బుట్టా శివ నీలకంఠ క్రైస్తవ సోదర%-%సోదరీమణులకు హృదయపూర్వక క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజెశారు. బుట్టా శివ నీలకంఠ మాట్లాడుతూ "పేదల పట్ల ప్రేమ, బాధితుల పట్ల కరుణ, సమాజానికి సేమఇవి ఏసుక్రీస్తు మనకు ఇచ్చిన అసలు సందేశాలు. ఈ విలువలు ప్రతి మనిషి హృదయంలో నిలిచినప్పుడు మాత్రమే నిజమైన మానవత్వం వికసిస్తుంది."యేసుక్రీస్తు వారి సందేశంలో త్యాగం, క్షమ, సహనం వంటి గుణాలు సమాజాన్ని ముందుకు నడిపే బలంగా ఉంటాయని, మతాల మధ్య భేదాలు కాకుండా పరస్పర గౌరవం, ఐక్యత సమాజ అభివృద్ధికి పునాదిగా నిలుస్తాయని స్పష్టం చేశారు, ప్రతి మనిషి ఒక కుటుంబంలా కలిసిమెలిసి జీవించాల్సిన అవసరం ఈ క్రిస్మస్ మరొకసారి గుర్తుచేస్తుంది అని ఆయన పేర్కొన్నారు.ప్రజలతో కలిసి పండుగను జరుపుకోవడం ద్వారా ఆనందాన్ని పంచుకోవడమే వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆశయమని, ప్రజల గుండెల్లో ప్రేమ, నమ్మకాన్ని నిలుపుకోవడమే పార్టీ రాజకీయాల పరమార్థమని ఆయన భావవ్యక్తం చేశారు.ఈ క్రిస్మస్ మహాపర్వం ఎమ్మిగనూరులో మతసామరస్యానికి, సామాజిక ఐక్యతకు, మానవత్వానికి ప్రతీకగా నిలిచింది, ప్రతి ఇంటికి శాంతి, సౌభ్రాతృత్వ సందేశాన్ని చేరవేసిందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు పట్టణ మునిసిపల్ వైస్ చైర్మన్ డి. నజీర్ అహమ్మద్, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ముగతి వీరుపాక్షి రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యు.కె. రాజశేఖర్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కోరిశెట్టి మధుబాబు, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు దొరబాబు నాయుడు, మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు మహబూబ్ బేగ్, సోషల్ మీడియా జిల్లా ఉపాధ్యక్షులు షేక్ చాంద్, పట్టణ ప్రధాన కార్యదర్శి గడ్డం అంజి, పట్టణ కార్యదర్శి గురువ మాభాష, మాజీ కౌన్సిలర్ చేనేత మల్లి,15వార్డు ఇంచార్జ సయ్యద్ ఫయాజ్, 5వ వార్డు నాయకులు ఇబ్రహీం, పట్టణ బీసీ సెల్ ఉపాధ్యక్షులు బోయ మని, బీసీ సెల్ కార్యవర్గ సభ్యులు మంజునాథ్, 8వ వార్డు నాయకులు కిరణ్, బండారి యల్లప్ప, బండారి హనూక్, బండారి చక్రవర్తి, ఎమ్మిగనూరు మండల కార్యదర్శి తిమ్మాపురం బజారి, నందవరం మండల బీసీ సెల్ అధ్యక్షులు బాపురం చిన్న రాముడు, సొగనూరు ఎంపీటీసీ మధుసూదన్ రెడ్డి, ప్రతాప్ గౌడ్, కడివేళ్ల కృష్ణ, కడివేళ్ల ఉరుకుంద గౌడ్, బనవాసి ఫారం రాజ్ కుమార్, మిట్ట సోమపురం సర్పంచ్ నరసింహులు, మాసుమన్ దొడ్డి శ్రీనివాసులు, తిరుపతయ్య, పోస్ట్ శ్రీను, కోటేకల్ గ్రామానికి చెందిన తయన్న, తిమ్మప్ప, వీరేష్, రాఘవేంద్ర, పాపన్న, దైవందీన్నె కె.వి. నాగరాజు, కె.వి. భరత్, బి. శీను, బి. శివ, పెద్ద మరివీడు మాజీ సర్పంచ్ దేవేంద్ర, రామాంజినేయులు, నాగేష్, రామకృష్ణ, నభి, తదితరులు పాల్గొని వేడుకలకు అపూర్వ వైభవం చేకూర్చారు.

## జనవరి 2 నుండి 9 వరకు
# కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ



### – జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో :** రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్ ఆదేశాల మేరకు, తిరిగి సర్వే చేయబడిన గ్రామాల్లో కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలను 2026 జనవరి 2 నుండి 9 వరకు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ భూమి మరియు పట్టాదార్ పాస్ పుస్తకాలపై హక్కులు చట్టం, 1971 ప్రకారం, పునఃసర్వేలో భాగంగా రూపొందించిన కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలలో రాజకీయ పార్టీల లోగోలు, పేర్లను తొలగించి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చిహ్నాన్ని చేర్చడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో, జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో సజావుగా, పారదర్శకంగా పంపిణీ కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులను అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు. కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ సందర్భంగా జనవరి 2 నుండి 9 వరకు ప్రతి రెవెన్యూ గ్రామంలో గ్రామసభలు నిర్వహించి, అర్హులైన పట్టాదారులకు ఎటువంటి పొరపాట్లు లేకుండా పాస్ పుస్తకాలు అందజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పంపిణీ ప్రక్రియలో వెబ్‌ల్యాండ్ రికార్డులతో ముద్రిత పాస్ పుస్తకాలను పూర్తిగా క్రాస్ చెక్ చేయాలని, సంబంధిత పట్టాదారుల బయోమెట్రిక్ ధృవీకరణ ద్వారా మాత్రమే పాస్ పుస్తకాలు అందజేయాలని స్పష్టం చేశారు. ఇందుకోసం అవసరమైన బయోమెట్రిక్ పరికరాలు ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు. వీఆర్వోల ద్వారా ఆన్‌లైన్ ఈ కేవైసీ అప్లికేషన్ ఉపయోగించి పంపిణీ ప్రక్రియ చేపట్టాలని, లబ్ధిదారుల నుండి సరైన రసీదును రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. అలాగే, పాత పట్టాదార్ పాస్ పుస్తకాలను తిరిగి సేకరించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీపై గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం కల్పించి, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు సహా అన్ని వాటాదారులకు షెడ్యూల్‌ను ముందుగానే తెలియజేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పంపిణీ కార్యక్రమం సజావుగా, సమయపాలనతో జరగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా వారీ పంపిణీ షెడ్యూల్‌ను ఈ నెల 30 నాటికి భూపరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయానికి పంపించాలని అధికారులను ఆదేశిస్తూ, ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో, బాధ్యతాయుతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారు

### – ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సిహెచ్ నాగరాజు



**హొళగుంద పల్లె వెలుగు డిసెంబర్ 25 :** విద్యార్థి దశ నుండి విద్యార్థిని, విద్యార్థులు పట్టుదలతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను చేరుకుంటారని ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సిహెచ్ నాగరాజు అన్నారు గురువారం స్థానిక సీజనల్ హాస్టల్లో , ఈనెల డిసెంబర్ 22న శ్రీనివాస్ రామానుజన్ జయంతి సందర్భంగా గణిత శాస్త్ర సబ్జెక్టుకు సంబంధించి ఉపాధ్యాయులు పోటీ పరీక్షలు నిర్వహించారు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పోటీ పరీక్షలు పట్టుదలను పెంచడం కాకుండా తప్పు ఒప్పులని తెలుసుకుని ముందుకు వెళ్లడానికి వీలవుతుందన్నారు విద్యార్థి దశ నుండి క్రమశిక్షణను అలవర్చుకొని కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే సాధ్యం కానిది అంటూ చదువుల్లో ఏది ఉండదన్నారు మనకు ఏదైనా అర్థం కాకపోతే ఎవరేమనుకున్నా పర్వాలేదు మౌనంగా ఉండకుండా ఉపాధ్యాయులతో చెప్పించుకోవాలన్నారు, వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోహెబ్, దుర్గయ్య, సీజనల్ హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీలో ‘గురు ‘తర బాధ్యత

### – మా రాసు గురు బాబుకు కీలక బాధ్యతల్ని అప్పగించనున్న అధిష్టానం?
### – నంద్యాల జనసైనికులలో ఉరిమే ఉత్సాహం
### – జనసేన పార్టీ రాష్ట్ర నాయకులతో గురుబాబుకు కీలక పదవి పై భరోసా







**నంద్యాల . డిసెంబర్ 25 . (పల్లె వెలుగు ):** జనసేన పార్టీ రాష్ట్రవ్యాప్తంగా పార్టీని సంస్థాగతంగా బలపరచడానికి అధినేత పవన్ కళ్యాణ్ తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుండి జనసేన పార్టీ ఆవిర్భావం నుండి పనిచేస్తున్న క్రియాశీలక సభ్యులతో జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు సూచనలు, సలహాలు అందుకుంటున్నారు. నంద్యాల జనసేన పార్టీ నాయకులు మారాసు గురుబాబు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాం తాళ్లూరి ని,ఆంధ్రప్రదేశ్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాసరావు కేకే, జనసేన పార్టీ ఎమ్మెల్సీ హరిప్రసాద్, పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ చలనచిత్ర కళ శాఖ రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ను ప్రత్యేకంగా మర్యాదపూర్వ కంగా కలవడం జరిగింది. నంద్యాల జిల్లాలో జనసేన పార్టీ బలపడడానికి త్వరలో నియమిస్తున్న కమిటీలపై గురు బాబు తో రాష్ట్ర నాయకులు అభిప్రాయం తీసుకోవడం జరిగింది. పార్టీ ఆవిర్భావం నుండి పనిచేసిన నాయకుల వివరాలను, జనసేన కార్యకర్తల బాగోగులను ఆరా తీసినట్లు సమాచారం అంతేకాకుండా జనసైనికులకు నిత్యం అందుబాటులో ఉంటూ, తనదైన సేవా కార్యక్రమాలతో పట్టణంలో ప్రజలలో ఎంతో గుర్తింపు పొంది, అందరితోనూ కలిసిపోయే మనస్తత్వం ఉన్న గురు బాబుకు జిల్లాలో కీలక పదవి ఇవ్వనున్నట్లు భరోసా ఇచ్చినట్లు జనసైనికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గురు బాబు వంటి కష్టపడే జన సైనికులకు పట్టం కడితే రానున్న మున్సిపాలిటీ ఎన్నికలలో జిల్లాలో జనసేన సత్తా చాటుతుందని పార్టీలో సీనియర్ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# గొడుగు ఖాదర్ బాషా వివాహ వేడుకలకు హాజరైన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



**పోరుమామిళ్ల, డిసెంబర్ 25 ( పల్లె వెలుగు ) :** పోరుమామిళ్ల మండలం పుల్లివీడు గ్రామానికి చెందిన గొడుగు గురమ్మ, మస్తాన్ దంపతుల కనిష్ఠ పుత్రుడు గొడుగు ఖాదర్ బాషా వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వివాహ వేడుకలకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ పంచాయతీరాజ్ ప్రభుత్వ సలహాదారు నాగార్జున రెడ్డి, నియోజకవర్గం బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి, వైస్ఎంపీపీ సీఎం భాష, జెడ్పిటిసి ముత్యాల ప్రసాద్, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, జిల్లా అనుబంధం విభాగాల నాయకులు రాళ్లపల్లి నరసింహులు, గాజుల పల్లె రవిచంద్ర రెడ్డి పాల్గొన్నారు. అలాగే పుల్లివీడు సర్పంచ్ తిమ్మారెడ్డి రఘునాథరెడ్డి, సచివాలయం అధ్యక్షుడు వెంకటరెడ్డి, పార్టీ నాయకులు కల్లూరి రామిరెడ్డి, పుల్లారెడ్డి, మస్తాన్, మాజీ ఎంపీపీ కుమారుడు రఫీ, తోట గంగయ్య, హుస్సేన్, కాశయ్యతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై వివాహ వేడుకలను శోభాయమానం చేశారు.

# టిడిపి జిల్లా ఉపాధ్యక్షులుగా కల్లూరి శకుంతలమ్మ




**శిరివెళ్ల (పల్లె వెలుగు) :** సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కల్లూరి శకుంతలమ్మకు నంద్యాల పార్లమెంట్ జిల్లా స్థాయి ఉపాధ్యక్షులుగా పదవి వరించింది. ఎంతో కాలంగా తెలుగుదేశం పార్టీని భూమా కుటుంబానికి అనుచరులుగా అభిమానులుగా ఉంటూ వచ్చిన శకుంతలమ్మకు పార్లమెంటు స్థాయి ఉపాధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించినట్లు టిడిపి వర్గాలు తెలియజేశాయి. ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ శాసన సభ్యురాలు భూమా అఖిలప్రియ గారి ఆదేశాల మేరకు కల్లూరి శకుంతలమ్మను జిల్లా ఉపాధ్యక్షులుగా పదవి వరించినట్లు తెలియజేశారు. మాజీ సర్పంచ్ గా టిడిపి మహిళా నేతగా భూమా కుటుంబానికి ప్రధాన అనుచరులుగా ఉంటూ వచ్చిన కల్లూరి శేష ఓబుల రెడ్డి సతీమణి మాజీ సర్పంచ్ కల్లూరి శకుంతలమ్మకు ఆళ్లగడ్డ నియోజకవర్గం నుండి జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించినందుకు ఎమ్మెల్యే భూమ అఖిలప్రియకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి కి సన్మానాలు చేసిన టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్







**ఎమ్మిగనూరు పల్లె వెలుగు డిసెంబర్ 25 :** తెలుగుదేశం పార్టీ కర్నూలు పార్లమెంట్ కమిటీలో ఎమ్మిగనూరు నుంచి ఎంపికైన పలువురు సభ్యులు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కి ధన్యవాదాలు తెలిపారు. కర్నూలు పార్లమెంట్ కమిటీలో తమకు ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. పార్టీ బలోపేతం, ప్రజాసేవ, ప్రభుత్వ పథకాల విస్తరణ కోసం మరింత సమర్థవంతంగా పని చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ ,మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ మల్లయ్య, రామకృష్ణ, మల్లీ ,వీరేష్, టౌన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ఏవీఎస్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక




**ఆళ్లగడ్డ.( పల్లె వెలుగు) :** ఏవీఎస్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక. ఆంధ్ర విద్యార్థి సంఘం చాగలమర్రి మండల నూతన కమిటీని వేయడం జరిగిందనీ లక్కు కార్తీక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంకి ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్కు కార్తీక్. మరియు జిల్లా అధ్యక్షుడు యుగంధర్ మాట్లాడుతూ . ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్రంలో ఉన్న విద్యార్థుల సమస్యల పై పోరాడుతూ నేషన్ స్టడీ కల్చర్ అనే నినాదాన్ని విద్యార్థుల కోసం పని చేస్తుంది అని తెలిపారు. చాగలమర్రి మండల అధ్యక్షుడు గా పూజనబోయిన వంశీ యాదవ్ నీ, మండల కార్యదర్శి కోచల తేజను నియోజకవర్గం కన్వీనర్ గా కనగని సాయినీ, సహాయక కార్యదర్శి గా పూజనబోయిన యశ్వంత్ నియోజకవర్గం కో కన్వీనర్ గా జిలాన్ నీ ఎన్నుకోవడం జరిగింది. వారు మాట్లాడుతూ. నా పైన నమ్మకం ఉంచి నాకు ఈ బాధ్యత ను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ రెడ్డిఅన్నకు స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తురుక ప్రసాద్ అన్న కురాష్ట్ర కార్యదర్శి శంకర్ రెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు గారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తూ. ఆంధ్ర విద్యార్థి సంఘాన్ని విద్యార్థులో చైతన్యాన్ని నింపుతూ ముందుకు వెళ్తానని ఈ సందర్భంగా తెలియజేస్తున్నామని తెలిపారు.

# మద్యం తాగి వాహనం నడిపితే జైలు శిక్ష తప్పదు: కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్



**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో :** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేసినట్లు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఏడాది 9,025 కేసులు నమోదు:2025 జనవరి నుండి డిసెంబర్ 20వ తేదీ వరకు జిల్లాలో మొత్తం 9,025 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం మద్యం తాగి వాహనాలు నడపడమేనని గుర్తించిన పోలీసులు, ప్రమాదాల నియంత్రణకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

**నెల రోజులు జైలు శిక్ష:**

ఎవరైనా నిబంధనలను అతిక్రమించి మద్యం తాగి వాహనం నడిపితే, వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా.. కనీసం ఒక నెల రోజుల పాటు జైలు శిక్ష పడే విధంగా గట్టి చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రాణ నష్టాన్ని నివారించేందుకు వాహనదారులు పోలీసులకు సహకరించాలని, మద్యం సేవించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఆయన కోరారు.

ముఖ్యాంశాలు:

- ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు.
- జనవరి నుండి ఇప్పటివరకు 9,025 కేసులు నమోదు.
- మద్యం బాబులకు నెల రోజుల జైలు శిక్ష తప్పదని హెచ్చరిక.
- రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీసుల కార్యాచరణ.



# వెల్లువెత్తిన అభిమానం



- ప్రజా నాయకుడికి ఘన సన్మానం
- తెలుగుదేశం పార్టీ కర్నూలు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.అబ్దుల్ సుభాన్ ను ఘనంగా సన్మానించిన కూటమి నాయకులు...
- టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి కి ధన్యవాదాలు తెలిపిన మండల నాయకులు..

**హొళగుంద పల్లె వెలుగు డిసెంబర్ 25 :** టిడిపి కర్నూలు జిల్లా కార్యనిర్వహక కార్యదర్శిగా నియమితులైన హొళగుంద మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బి.అబ్దుల్ సుభాన్ ను కూటమి నాయకులు పెద్ద ఎత్తున పూలమాలలతో,శాలువాలతో ఘనంగా న త్క రి ం చి , శ ు భ ా కా ం క్ష ల ు తెలిపారు.మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల నుంచి టిడిపి నాయకులు కార్యకర్తలు వర్గాలకతీతంగా,పెద్ద ఎత్తున తరలి వచ్చి నూతన టీడీపీ కర్నూలు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అబ్దుల్ సుబాన్ ను పెద్ద ఎత్తున సన్మానించి సంబరాలు చేసుకున్నారు.ఈ సన్మాన కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ టి.తిప్పయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఈ. గోవింద గౌడ్,సింగిల్ విండో డైరెక్టర్ కోనేరు దుర్గయ్య, సీనియర్ నాయకులు తోక వెంకటేష్,మైనార్టీ నాయకులు ఆదం తదితరులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకై సంపూర్ణ విశ్వాసం, విధేయతలతో తన సేవలను అందించడమే కాక మండల వ్యాప్తంగా కులమతాలకు అతీతంగా గ్రామ గ్రామాన నాయకులతో సత్సంబంధాలను కలిగి ఉండడంతో పాటు ఇటు ప్రజలలో కూడా పటిష్ట ప్రేమాభిమానాలు కలిగినటువంటి హొళగుంద మాజీ వైస్ సర్పంచ్ బి.అబ్దుల్ సుభాన్ ను తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా న ి య ం మి ం చి న ం ద ు క ు గా న ు నాయకులందరూ వర్గాలకు అతీతంగా ఏకతాటిగా తెలుగుదేశం పార్టీ అధిష్టానానికి ఆలూరు ఇన్చార్జి వైకుంఠం జ్యోతి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ లకు హొళగుంద మండలం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలను తెలియజేశారు.తెలుగుదేశం పార్టీని గ్రామస్థాయిలో పటిష్టతకై తనవంతుగా కృషి చేసిన తన సేవలను గుర్తించి తనను జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించినందుకు గాను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,రాష్ట్ర ఐటి%ఉ%విద్యా శాఖ నారా లోకేష్,టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ,ఆలూరు టిడిపి ఇన్చార్జ్ వైకుంఠం జ్యోతి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, హొళగుంద మండల సీనియర్ నాయకులు తదితరులకు పార్లమెంట్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. అబ్దుల్ సుభాన్ కృతజ్ఞతలు తెలియజేశరు. కులమతాలు, వర్గాలకు అతీతంగా మండలంలోని అన్ని గ్రామాల నాయకులు కార్యకర్తలు మరియు ప్రజలతో నిష్కల్మషంగా వ్యవహరించి తెలుగుదేశం పార్టీ పటిష్టత, పురోభివృద్ధిల కొరకు పసుపు సైనికుడిలా కృషి చేస్తానని,రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా టిడిపి సత్తాను చాటుతా మని ధీమా వ్యక్తం చేశారు.రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలకై తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు శ్రేయోభిలాషులు సైనికుల సన్నద్ధం కావాలని గ్రామ గ్రామాన పసుపు ప్రభంజనం వెల్లివిరిసాలని పిలుపుని చ్చారు.అనంతరం నూతనంగా ఎన్నుకోబ డిన యువనాయకులు ఐటిడిపి ఆలూరు అసెంబ్లీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఖాదర్ భాషా, తెలుగు యువత మండల అధ్యక్షులు బకాడ వీరేష్ లను తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సమ్మతగిరి సీతయ్య, గాదిలింగ,బాగోడి రాముడు, కోగిలతోట సలీం, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గజ్జహల్లి నబి రసూల్, కో కన్వీనర్ జాకీర్, జనసేన కన్వీనర్ అశోక్, కార్యదర్శి చిన్న, బిజెపి రాష్ట కార్యవర్గ సభ్యులు చిదానంద, మాజీ కన్వీనర్ ప్రసాద్, నాయకులు బుడుగజంగాల రామాంజి, హుస్సేన్ పీరా, కరూర్ పిరన్న, కురువ మల్లికార్జున, యువ నాయకులు దిడ్డి తిక్కస్వామి, ఐకల్ మల్లికార్జున, బూత్ కన్వీనర్లు శాలి అమాన్, తాహెర్,ఆలూరు వలిబాష, మైనార్టీ కమిటీ సభ్యులు కూడ్లూర్ సుభాన్, మంగలి సంజీవ్,మంగయ్య, జమీయతే-అహ్లే హదీస్ మండల అధ్యక్షులు ముల్లా సాదిక్,ఉపాధ్యక్షులు ముల్లావలి,ప్రధాన కార్యదర్శి మౌలానా సమీవుల్లా జామయి,శాలి వలి సాబ్, కూడ్లూర్ జప్రుల్లా,కూడ్లూర్ అమాన్, కూడ్లూరు ఫారుక్,జాఫర్,అల్తాఫ్,అనస్ మరియు వివిధ గ్రామాల నుండి విచ్చేసిన టిడిపి-జనసేన-బిజెపి కూటమి నాయకులు, కార్యకర్తలు,పెద్దఎత్తున పాల్గొన్నారు.

# నందిపాడు గ్రామంలో పురాతన బావికి పునర్జీవనం

- గ్రామస్తుల శ్రమదానం
- అధికారుల అభినందనలు





**కొలిమిగుండ్ల (పల్లె వెలుగు న్యూస్ ):** నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలంలోని నందిపాడు గ్రామంలో ఎన్నో దశాబ్దాల చరిత్ర కలిగిన పురాతన బావి సంవత్సరాలుగా నిరుపయోగంగా, చెత్త-మురుగుతో నిండిపోయి చండాల స్థితిలో ఉండగా, గ్రామస్తులు, హిందూ ధర్మ సంఘం, మండలంలోని కొంతమంది వ్యక్తుల చొరవ తీసుకుని ఆ బావిని పునర్జీవింపజేసే కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామాభివృద్ధి పట్ల ఉన్న బాధ్యతాభావంతో గత మూడు రోజులుగా స్వచ్ఛందంగా శ్రమదానం చేస్తూ బావిని శుభ్రపరచడం జరుగుతోంది.పూర్వకాలంలో గ్రామానికి ప్రధాన నీటి వనరుగా ఉన్న ఈ బావి, కాలక్రమేణా నిర్లక్ష్యానికి గురై పూర్తిగా ఉపయోగం లేకుండా మారింది. ఈ పరిస్థితిని గమనించిన గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు అందరూ కలిసి ఐక్యంగా ముందుకు వచ్చి, బావిలో పేరుకుపోయిన మట్టిని, చెత్తను తొలగిస్తూ, నీటిని శుభ్రం చేసే పనులు చేపట్టారు. ఈ కార్యక్రమం గ్రామంలో మంచి స్పందనను రాబట్టింది.ఈ విషయాన్ని తెలుసుకున్న కొలిమిగుండ్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మద్దినేని రమేష్ బాబు ఈరోజు స్వయంగా నందిపాడు గ్రామానికి చేరుకుని పురాతన బావిని పరిశీలించారు. బావి శుభ్రపరిచే పనుల్లో పాల్గొన్న గ్రామస్తులను ప్రత్యక్షంగా అభినందిస్తూ, వారి సేవా మనసును కొనియాడారు. గ్రామాభివృద్ధి కోసం ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని సీఐ పేర్కొన్నారు.పురాతన నీటి వనరులను కాపాడుకోవడం ద్వారా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఇలాంటి కార్యక్రమాలు ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తాయని ఆయన అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు ప్రజల భాగస్వామ్యం ఉంటేనే గ్రామాలు నిజంగా అభివృద్ధి చెందుతాయని స్పష్టం చేశారు.గ్రామస్తుల ఐక్యత, శ్రమదానం వల్లే ఈ బావి పునర్జీవనం సాధ్యమవుతుందని, భవిష్యత్ తరాలకు ఇది ఒక మంచి ఉదాహరణగా నిలుస్తుందని పలువురు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామ ప్రజలు సీఐ ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ తరహా కార్యక్రమాలను ఇంకా కొనసాగిస్తామని పేర్కొన్నారు.నందిపాడు గ్రామంలో జరిగిన ఈ పురాతన బావి పునర్జీవన కార్యక్రమం ప్రస్తుతం చుట్టుపక్కల గ్రామాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

# గౌరవవేతనం విడుదల చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన 38వవార్డ్ పాస్టర్‌లు



**పల్లె వెలుగు నంద్యాల :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా చర్చిల పాస్టర్ లకు నెలకు 5 వేలు గౌరవ వేతనం సంబంధించి సంవత్సరం కాలానికి 60వేల రూపాయల నగదును క్రిస్మస్ కు ఒకరోజు ముందుగా పాస్టర్ ల ఖాతాలలో జమ చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మంత్రి నారా లోకేష్ కు మైనార్టీ శాఖ మంత్రి ఎన్ ఎమ్ డి ఫరూక్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.గురువారం నంద్యాల 38వవార్డ్ టీడీపీ ఇన్ చార్జ్ తాటికొండ బుగ్గరాముడు ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈసందర్భంగా తాటికొండ బుగ్గరాముడు మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు పాస్టర్ లకు ఒకే సంవత్సరానికి గాను మొత్తం 60వేల రూపాయలు విడుదల చేసి పాస్టర్ ల కళ్ళలో ఆనందం చూపించినందుకు పాస్టర్ల తరపున కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఇంకా ఎవరికైనా గౌరవ వేతనం రాని పాస్టర్లకు పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించి వారి ఖాతాలో కూడా నగదు జమ అయ్యేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల 38వ వార్డుకు సంబంధించిన పాస్టర్ పాల్, కిషోర్ పాల్, జోసెఫ్, జయరాం రెడ్డి, ఆశీర్వాదం పాల్, రాజ్ సిస్టర్ సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

# క్రీస్తు లోకానికి వెలుగు



## కలసపాడు ఎస్పిజి చర్చ్ లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**కలసపాడు డిసెంబర్ 25 (పల్లె వెలుగు )**

లోకానికి వెలుగైన క్రీస్తు బాటలో మనం నడవాలని ప్రేమ శాంతి సమాధానం ఐకమత్యంతో సమాజం ముందుకు పోవాలని కలసపాడు ఎస్పీజీ చర్చ్ డినరీ చైర్మన్ రెవ మద్దెల ఆనంద్ కుమార్ ఉద్బోధించారు. కలసపాడు లోని పరిశుద్ధ పేతురు పరిశుద్ధ పౌలు చర్చిలో బుధవారం ఉదయం క్రిస్మస్ సంబరాల్లో భాగంగా రెవరెండ్ ఆనంద్ కుమార్ బైబిల్ వాక్య సందేశం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రేమ శాంతి సమాధానలే ఈ లోకాన్ని నడిపిస్తాయని లోక రక్షకుడైన ఏసుక్రీస్తు ఈ లోకంలో మనకు నేర్పిన మాదిరిగా జీవించాలని ఆయన వివరించారు. బుధవారం రాత్రి ఆరాధన అయిన వెంటనే కలసపాడు పురవీధుల్లో





క్రిస్మస్ క్యారల్స్ క్రీస్తు పుట్టుక ను గూర్చిన పాటలు పాడుతూ క్రీస్తును కొనియాడారు. గురువులు విశ్వాసులు సిలువ వెంబడి గుడి చుట్టూ ప్రదక్షణ చేశారు. గురువులు భక్తులకు సామూహిక ప్రార్ధనలు చేశారు. క్వయర్ బృందం క్రిస్మస్ గీతాలు ఆలపించారు. ఆరాధన అయిన వెంటనే ఉపాధ్యాయుడు కారు. జె.ప్రవీణ్ కుమార్ పలువురు పేదలకి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఆశిష్ గాబ్రియల్ వినయదాస్ సైమన్ రత్నరాజు కమలాకర్ ప్రసన్న రాహుల్ యేసుదాస్ స్వామిపాదం విజయజ్యోతి డేవిడ్ రవి సుధాకర్ కేజే ప్రవీణ్ కుమార్ శ్రీనివాస్ పాల్ సంఘ సభ్యులు, స్త్రీల మైత్రి సభ్యులు రెవరెండ్ ఆర్థర్ ఇన్మన్ యూత్ మరియు తదితరులు పాల్గొన్నారు

## మాజీ ఎంపీపీ దేవరాజు మృతి

**సి బెళగల్ పల్లెవెలుగు డిసెంబర్ 25**



సి,బెలగల్ మండలం మాజీ ఎంపీపీ మల్లెపోగు దేవరాజు అంత్యక్రియలో పాల్గొన్న కే డి సి సి బ్యాంక్ చైర్మన్ డి విష్ణువర్ధన్ రెడ్డి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సి బెళగల్ మండలంలోని పోలకల్ గ్రామ మాజీ



సర్పంచ్ టీడీపీ సీనియర్ నాయకుడు మల్లెపొగు దేవరాజు(78) అనారోగ్యంతో బుధువారం రాత్రి మృతి చెందారు.దేవరాజు 1987 నుండి 1994వరకు ఏడు సంవత్సరములు పోలకల్ సర్పంచ్‌గా పని చేశారు అటు తరువాత 2002 నుండి 2006వరకు ఐదు సంవత్సరములు సి బెళగల్ ఎంపీపీ గాచేసినారు గత కొంతకాలం నుండి అనారోగ్యానికి గురైన దేవరాజ్ బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఈ విషయము తెలుసుకున్న టిడిపి ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ డి విష్ణువర్ధన్ రెడ్డి పోలకల్ గ్రామానికి చేరుకొని చేరుకొని సీనియర్ నాయకుడు దేవరాజ్ భౌతికదేహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు సందర్భంగా కేడీసీసీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ దేవరాజు ప్రజాసేవలో అంకితభావంతో పనిచేసిన నాయకుడని బెలగల్ మండల అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే దేవరాజ్ మరణం పార్టీకి మండల ప్రజలకు తీరనిలోటని ఆయన తెలిపారు అంతిమయాత్రలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కేడీసీసీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి మండల టిడిపి నాయకులు ప్రజా ప్రతినిధులు అధికారులు ఉన్నారు





## క్రిస్మస్ సందడి భక్తిశ్రద్ధలతో

# క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు

**గూడూరు పల్లెవెలుగు డిసెంబర్ 25**

క్రిస్మస్ అనేది లోక రక్షకుడు ఏసుక్రీస్తు జన్మదినాన్ని గుర్తుచేసే పవిత్ర పండుగ ప్రతి సంవత్సరం డిసెంబర్ 25 న ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవ సహోదరులలు జరుపుకునే అతిపెద్ద పండుగ గూడూరు మండల వ్యాప్తంగా క్రిస్మస్ పండుగను భక్తుశ్రద్ధలతో జరుపుకున్న క్రైస్తవులు జులకల్ చర్చిలో (గురువారం) క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి ఊరేగింపు, ప్రత్యేక ప్రార్థనలతో వేడుకలు ఆరంభించారు ఆరాధనకు భక్తులు భారీగా పాల్గొన్నారు. దైవ సందేశాన్ని పాస్టర్ ఏ ఇమ్మానియేల్ వినిపించారు. ఆయన ప్రసంగంలో ఏసు క్రీస్తు జన్మ వెనుక ఉన్న అసలు సందేశాన్ని వివరించారు. ప్రేమ, క్షమ, త్యాగం, మానవత్వం వంటి విలువలు ఈ ప్రపంచానికి ఎంత అవసరమో ఆయన తన ఉపన్యాసంలో స్పష్టంగా చెప్పారు. సమాజంలో పెరుగుతున్న ద్వేషం, అసహనం మధ్య క్రిస్మస్ పండుగ మనకు శాంతి మార్గాన్ని చూపుతుందని ఆయన పేర్కొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు





**గడివేముల పల్లె వెలుగు దినపత్రిక**

నంద్యాల జిల్లా మండలంలో క్రీస్తు జన్మదిన సందర్భంగా క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఎన్ని గ్రామాలలో క్రైస్తవులు ఈ పండుగను ఒక గొప్ప పండుగ జరుపుకుంటారని పిల్లలు కుటుంబ సభ్యులతో కలిసి వెండి ఉండదు ఆలపించి సంతోషంగా గడుపుతారు. క్రీస్తు ఈ లోకానికి వెలుగైన క్రీస్తు బాటలో మనం నడవాలని ప్రేమ శాంతి సమాధానం ఐకమత్యంతో సమాజం ముందుకు పోవాలని తెలుగు బాప్తిస సంఘం పెసరవాయి చర్చిపాస్టర్ రెవరెండ్ కాటం రాజు ఆధ్వర్యంలో క్రిస్మస్ సంబరాల్లో భాగంగా క్రీస్తు జననం గురించి పాటలతో ఆలాపన చేసి బైబిల్ వాక్య సందేశం చేశారు. మరి కొంతమంది వాక్య బోధకులు అనగా జీ.వెంకట రమణ.. వై సోమన్న. వారు మాట్లాడుతూ ప్రేమ శాంతి సమాధానలే ఈ లోకాన్ని నడిపిస్తాయని లోక రక్షకుడైన ఏసుక్రీస్తు ఈ లోకంలో మనకు నేర్పిన మాదిరిగా జీవించాలని ఆయన వివరించారు. క్రీస్తు గురించి ఏ.శీనువాసులు తన యొక్క జీవితంలో జరిగిన ఏసు మహిమ గురించి సందేశం తెలిపారు. క్రీస్తును నమ్ముకుంటే ఎలాంటి బాధలు కష్టాలు అయినా తొలుగుతాయని తెలిపారు,ఆరాధన పురవీధుల్లో క్రిస్మస్ క్రీస్తు పుట్టుక పాటలు పాడుతూ క్రీస్తును క్రీస్తు సిలోను ఇంటింటికి తిరుగుతూ పాటలు ద్వారా వాక్యం ద్వారా వారి సందేశం ఇచ్చారు, ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు యవనస్తులు మహిళలు చిన్న పెద్ద తేడా లేకుండా క్రీస్తు యొక్క సందేశాన్ని ఆలకించారు.

# టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడుకు సన్మానం చేసిన జర్నలిస్టులు

### జర్నలిస్టులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తా,,,,,, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్,,,,,,

**ఎమ్మిగనూరు పల్లె వెలుగు డిసెంబర్ 25**

తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా ఎమ్మిగనూరుకు చెందిన టీడీపీ నాయకులు భాస్కర్ల చంద్రశేఖర్ ని ఎంపిక చేస్తూ రాష్ట్ర టీడీపీ అధిష్టానం ప్రకటించింది. చురుగ్గా పార్టీలో పనిచేసే కార్యకర్తలకు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయనాగేశ్వర్ రెడ్డి తగిన గుర్తింపు ఇస్తున్నారన్నారు. అనంతరం భాస్కర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవిని ఇచ్చిన సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయనాగేశ్వర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని, స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా ముందుకు పోతానని తెలిపారు. ఈ మేరకు నియోజకవర్గంలోని జర్నలిస్టులు



కుటుంబాలకు ఏమైనా అవసరం ఉంటే అన్ని సౌకర్యాలు కల్పిస్తా అని ఈరన్న , పార్థు, ఎర్రన్న, జర్నలిస్టులకు హామీ ఇచ్చారు

# చర్చ్ లో ప్రత్యేక ప్రార్ధనలు పాల్గొన్న వైస్సార్సీపీ ఇంచార్జ్ రాజీవ్ రెడ్డి



నందవరం పల్లె వెలుగు డిసెంబర్ 25

నందవరం మండలం నందవరము మేజర్ పంచాయతీ పరిధిలోని ఐఎంబి చర్చ్ లో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనా సభ ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. ఈ ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి పాల్గొని, క్రిస్మస్ సందేశాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా పాస్టర్ బి.ఎన్. ప్రసాద్ గారిని, సంఘ పెద్దలను రాజీవ్ రెడ్డి పూలమాలలు శాలువాలు ఘనంగా సన్మానించారు. అనంతరం పాస్టర్లు రాజీవ్ రెడ్డిని ఉద్దేశించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, దైవ ఆశీర్వాదాలను అందించారు. రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభు యేసు క్రీస్తు బోధించిన ప్రేమ, క్షమ, సేవ భావన ప్రతి ఒక్కరి జీవితంలో నిలవాలని ఆకాంక్షిస్తూ, ఎస్సీ క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు హృదయపూర్వకంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలోజిల్లా అధికార ప్రతినిధి కదిరికోట సునీల్ కుమార్ నందవరం మండల జడ్పిటిసి నిఖిల్ చక్రవర్తి,పట్టణ యువ నాయకులు ప్రభాకర్,శావల బుజ్జిబాబు, శావల శాంతి రాజు, శావల సత్యానందం, శావల భాస్కర్,ప్రవీణ్ కుమార్, యోహాను, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.













## దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టి ఉన్నాడు

### ఘనంగా క్రిస్మస్ సంబరాలు

నందవరం పల్లె వెలుగు డిసెంబర్ 25

నందవరం మండలంలో కనకవీడు గ్రామంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి పిల్లలు పెద్దలు గ్రామ ఎంప్లాయిలు కలసి సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుని ప్రార్థించాలని వారు తెలిపారు దావీదు పట్టణము మందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు ఆయనే నజరేయుడైన ఏసుక్రీస్తు బెత్లహేము గ్రామంలో కన్యక గర్భవతి అయినా మరియా కుమారుని కన్నును ఆయనే ఏసుక్రీస్తు, ఆయనను ఆరాధిస్తూ ప్రార్థిస్తూ ఘనంగా క్రిస్మస్ సంబరాలు జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో పాస్టర్ పురుషోత్తం, యువరాజ్, సంఘ పెద్దలు, నాగరాజ్, ప్రతాప్ స్వామిదాస్ , ఏలియా, ఎజ్కేల్, గ్రామ ఉద్యోగస్తులు భాస్కర్, జాన్ ,జార్జి, హనుమన్న, ఆమోస్, నాయకులు హుసేని ,మోజేష్, విజయరాజ్ , దుబ్బన్న , మనోహర్, నాగరాజ్ , విద్యార్థులు మహిళలు చిన్నారులు ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు.



# గంజాయి బారిన పడ్డ ఐదుగురు యువకులకు కౌన్సిలింగ్









## క్రిస్మస్ సందర్భంగా నాయకుల ఇళ్లకు వెళ్లి శుభాకాంక్షలు

### ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి

**ఎమ్మిగనూరు పల్లె వెలుగు డిసెంబర్ 25**

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయ నాగేశ్వర్ రెడ్డి పలు నాయకుల నివాసాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే వారి కుటుంబ సభ్యులతో కలిసి భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సందర్శించిన నివాసాలు

గుడికల్ గ్రామం దేవదాసు ఎమ్మిగనూరు PACS డైరెక్టర్) ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీ సుధాకర్

7వ వార్డు అంబేద్కర్ నివాసం (7వ వార్డు అధ్యక్షులు & HDC సభ్యులు)

కె. షాలెం నివాసం (టౌన్ కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్)

బనవాసి అబ్రహాం నివాసం (AMC డైరెక్టర్)

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని, అన్ని వర్గాల ప్రజలు ఐక్యతతో ముందుకు సాగాలని



## పులివెందుల చర్చిలో జగన్ కుటుంబం ప్రత్యేక ప్రార్థనలు

**సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మాజీ సీఎం తల్లి విజయమ్మ, భార్య భారతితో కలిసి హాజరు**

**చర్చి బయట వేచి ఉన్న అభిమానులకు అభివాదం, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన వైసీపీ చీఫ్**

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని వైసీపీ అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన కుటుంబ సభ్యులతో కలిసి పులివెందులలో సందడి చేశారు. గురువారం ఉదయం స్థానిక సీఎస్ఐ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. పులివెందుల పర్యటనలో భాగంగా జగన్ తన తల్లి వైఎస్ విజయమ్మ, భార్య వైఎస్ భారతి రెడ్డితో కలిసి చర్చికి చేరుకున్నారు. వారితో పాటు మరికొందరు కుటుంబ సభ్యులు కూడా ప్రార్థనల్లో పాల్గొన్నారు.అనంతరం జగన్ చర్చి వెలుపల వేచి ఉన్న అభిమానులు, స్థానికులకు అభివాదం చేస్తూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. జగన్ పర్యటన సందర్భంగా పులివెందులకు వైసీపీ కార్యకర్తలు, నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. చర్చి పరిసరాల్లో పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# నంద్యాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

**నలుగురు హైదరాబాద్ వాసుల దుర్మరణం**

**తిరుపతి నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డుకు అవతలి వైపునకు దూసుకెళ్లి బస్సును ఢీకొట్టిన వైనం**

**తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు**




నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండల పరిధిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. జాతీయ రహదారి-40పై నల్లగట్ల-బత్తలూరు మధ్య ఈ తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. తిరుపతి నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్‌ను దాటి అవతలి వైపు దూసుకెళ్లింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును బలంగా ఢీకొట్టింది. దీంతో కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రైవేట్ ట్రావెల్ బస్సు హైదరాబాద్ నుంచి పుదుచ్చేరి వైపు వెళ్తోంది. అదృష్టవశాత్తూ బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. వారిని వేరే బస్సులో వారి గమ్యస్థానాలకు పంపించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు.

## గిరిజన విద్యార్థుల స్కాలర్‌షిప్పులు విడుదల



**మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడి**

**అమరావతి, డిసెంబరు 25**

గిరిజన విద్యార్థులపోస్టు మెట్రిక్ స్కాలర్‌షిపల విషయంలో గత ప్రభుత్వ కాలంలో పెండింగ్ ఉన్న బకాయిలను కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కరించిందని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో గత ప్రభుత్వం కేవలం రూ.18.67 కోట్లు విడుదల చేయగా, పెండింగ్‌లో ఉన్న మూడు త్రైమాసికాలకు గాను రూ.71.67 కోట్లు కూటమి ప్రభుత్వ నేరుగా 69,227 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమచేసిందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరం స్కాలర్‌షిప్పు నిధులు ఆర్‌టీఎఫ్ కింద రూ.85.67 కోట్లు కళాశాలల ఖాతాల్లోకి, ఎంటీఎఫ్ రూ.9.11 కోట్లు విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి మొత్తం 42,203 మందికి విడుదల చేసినట్టు తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రస్తుతం అర్హులైన విద్యార్థులకు నిధులను విడుదల చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు మొత్తం రూ.100.93 కోట్లు విడుదల చేసి, 59,297 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకున్నామన్నారు. తద్వారా గిరిజన విద్యార్థుల విద్య నిలకడగా, సానుకూలంగా కొనసాగుతుందని పేర్కొన్నారు.



# వాజ్‌పేయి వంటి వారితో రాజకీయం చేసి ఇప్పుడు చిల్లర వ్యక్తులతో చేయాలంటే సిగ్గేస్తోంది

**- చంద్రబాబునాయుడు**

**- అమరావతిలో వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరించిన చంద్రబాబునాయుడు**

**- జైభారత్, జై తెలుగుతల్లి అంటూ ప్రసంగం ప్రారంభించిన ముఖ్యమంత్రి**

**- వాజ్‌పేయి, ఎన్టీఆర్ మధ్య మంచి అనుబంధం ఉందన్న చంద్రబాబునాయుడు**

వాజ్‌పేయి వంటి ఉన్నత స్థాయి నాయకులతో రాజకీయం చేసిన తనకు ఇప్పుడు చిల్లర వ్యక్తులతో రాజకీయం చేయాలంటే సిగ్గుగా ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి యాత్ర ఆగదని, సంపద, ఆరోగ్యం, ఆనందం ప్రజలకు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గతంలో వాజ్‌పేయి, ఇప్పుడు నరేంద్ర మోదీ తనకు స్ఫూర్తినిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజా రాజధాని అమరావతిలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని చంద్రబాబునాయుడు ఆవిష్కరించారు. అమరావతిలో వాజ్‌పేయి శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వాజ్‌పేయి విగ్రహావిష్కరణ అనంతరం చంద్రబాబునాయుడు ప్రసంగించారు. జై భారత్, జై తెలుగుతల్లి అంటూ ఆయన తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అమరావతిలో వాజ్‌పేయి జయంతి ఉత్సవాలను నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రపంచమంతా గుర్తించేలా అమరావతిని తీర్చిదిద్దుతామని ఆయన పునరుద్ఘాటించారు. వాజ్‌పేయి స్మృతివనాన్ని అమరావతిలో నిర్మించడానికి ఇక్కడి రైతుల త్యాగమే స్ఫూర్తి అని కొనియాడారు. చరిత్ర గుర్తించే విధంగా వాజ్‌పేయికి ఘనమైన నివాళి ఇవ్వాలనే సదుద్దేశంతో స్మృతి వనం నిర్మిస్తున్నట్లు చెప్పారు. 26 జిల్లా కేంద్రాల్లో అటల్ విగ్రహాలను ప్రతిష్ఠించేలా కూటమి సంయుక్తంగా కృషి చేస్తోందని చంద్రబాబునాయుడు తెలిపారు. అటల్ జన్మదినాన్ని సుపరిపాలన దివస్‌గా దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నామని ఆయన గుర్తు చేశారు. తెలుగు నేలలో కూడా అలాంటి స్ఫూర్తినిచ్చిన నేత ఎన్టీఆర్ అని, వీరంతా చరిత్రను తిరగరాసిన గొప్ప నాయకులని ఆయన అభివర్ణించారు. నేషనల్ ఫ్రంట్ ద్వారా కాంగ్రెసేతర పార్టీలను ఏకం చేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని ఆయన అన్నారు. వాజ్‌పేయి, ఎన్టీఆర్ మధ్య సుదీర్ఘ అనుబంధం ఉందని చంద్రబాబు గుర్తు చేశారు. జనసంఘ్ నుంచి భారతీయ జనతా పార్టీని ఏర్పాటు చేసిన ప్రయాణం కూడా ఎంతో కీలకమని ఆయన అన్నారు. వాజ్‌పేయి మంచి వక్తగా, కవిగా, ప్రజాహృదయ నేతగానే కాకుండా దేశ మౌలిక సదుపాయాలకు బలమైన పునాది వేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన ప్రతిపాదించిన గోల్డెన్ క్వాడ్రిలేటరల్ రహదారిని మొట్టమొదట తడ-చెన్నైల మధ్య ప్రారంభించామని గుర్తు చేశారు. దేశాన్ని అణుశక్తిగా మార్చి ప్రపంచానికి భారతీయుల సత్తా చాటిన ధీశాలి వాజ్‌పేయి అని చంద్రబాబు అన్నారు. కార్గిల్ యుద్ధం ద్వారా వాజ్‌పేయి, సింధూర్ ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత్ వైపు ఎవరైనా చూస్తే తగిన బుద్ధి చెబుతామని గట్టిగా చెప్పారని గుర్తు చేశారు. అబ్దుల్ కలాం, వాజ్‌పేయి ఇద్దరూ దేశం కోసం నిరంతరం శ్రమించిన మహానుభావులని అన్నారు. దేశం మెచ్చిన నేతగా వాజ్‌పేయి చిరస్మరణీయులని, అందుకే ఆయన స్మారకాన్ని అమరావతిలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్ వంటి మహనీయులకు కూడా అమరావతిలో స్మారక స్థూపం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ తెచ్చిన సంస్కరణలతో 11వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ అగ్రస్థానం దిశగా వేగంగా పయనిస్తోందని చంద్రబాబునాయుడు అన్నారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానానికి చేరుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. దేశాన్ని శిఖరాగ్రంలో నిలిపే శక్తి నరేంద్ర మోదీకి ఉందని ఆయన ప్రశంసించారు. రాజధానికి భూములు ఇచ్చిన అమరావతి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రాజధాని నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని వెల్లడించారు. నాడు ప్రధాని హోదాలో హైటెక్ సిటీకి అటల్ బిహారీ వాజ్‌పేయి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు అమరావతిలో క్వాంటం వ్యాలీని నిర్మిస్తున్నట్లు తెలిపారు. హైవేలు, పరిశ్రమలు, ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తోందని అన్నారు. గత వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ వెంటిలెటర్‌పై ఉందని, ఇప్పుడు కోలుకుని అభివృద్ధి ప్రయాణం మొదలు పెట్టిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. పీపీపీ ద్వారా మెడికల్ కళాశాలలు నిర్మించేందుకు ప్రయత్నిస్తుంటే కొందరు మోకాలడ్డుతున్నారని ఆరోపించారు. పీపీపీ అంటే ప్రైవేటు కాదని, ప్రభుత్వ ఆస్తేనని గుర్తించాలని సూచించారు. వాటిని నిర్వహించి తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తారని తెలిపారు.



# జంట హత్యల కేసులో పిన్నెల్లి సోదరులకు రిమాండ్ పొడిగింపు

**జంట హత్యల కేసులో నిందితులుగా ఉన్న పిన్నెల్లి బ్రదర్స్**

**జనవరి 7 వరకు రిమాండ్ పొడిగించిన జడ్జి**

**ప్రస్తుతం నెల్లూరు జిల్లా జైల్లో ఉన్న పిన్నెల్లి సోదరులు**

జంట హత్యల కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డికి మరో 14 రోజుల పాటు రిమాండ్ పొడిగించారు. నెల్లూరు జిల్లా జైల్లో ఉన్న పిన్నెల్లి సోదరులను మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి వర్చువల్ గా విచారించారు. వీరి రిమాండ్ ను జనవరి 7వ తేదీ వరకు పొడిగించారు.

కేసు వివరాల్లోకి వెళితే... ఈ ఏడాది మే 24న పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన అన్నదమ్ములు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావులు దారుణ హత్యకు గురయ్యారు. అన్నదమ్ములు ప్రయాణిస్తున్న బైకును కారుతో ఢీకొట్టి, బండరాళ్లతో కొట్టి హత్య చేశారు. ఈ కేసులో పోలీసులు 9 మందిని నిందితులుగా చేర్చారు. వీరిలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఏ6గా, పిన్నెల్లి వెంకటరామిరెడ్డిని ఏ7గా పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పిన్నెల్లి సోదరులు లొంగిపోయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వీరు నెల్లూరు జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు.

# ఏ బ్రాండ్ తాగి బయటకొచ్చాడో?: కేసీఆర్ పై టీడీపీ ఎమ్మెల్యే ఫైర్

**ప్రజలకు మొహం చూపించలేక ఫామ్ హౌస్ లో పడుకున్నారన్న ఎంఎస్ రాజు**

**మతి భ్రమించి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపాటు**

**బీఆర్ఎస్ పూర్తిగా బలహీనమయిందని వ్యాఖ్య**



చాలా కాలం తర్వాత బహిరంగంగా కనిపించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్... ఏపీ సీఎం చంద్రబాబుపై విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. ఎంవోయూలకు హైప్ క్రియేట్ చేయడంలో చంద్రబాబును మించిన వారు లేరని ఆయన విమర్శించారు. విశాఖలో గతంలో జరిగిన సీఐఐ సదస్సులో లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు అంటూ హంగామా చేశారని... అయితే, ఆ ఎంవోయూలపై సంతకాలు చేసింది స్టార్ హోటళ్లలోని వంట మనుషులు, సప్లై చేసేవాళ్లంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

ఈ వ్యాఖ్యలపై మడకశిర టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మండిపడ్డారు. ప్రజలకు మొహం చూపించలేక కేసీఆర్ రెండేళ్లుగా ఫామ్ హౌస్ లో పడుకున్నారని ఎద్దేవా చేశారు. ఏ బ్రాండ్ తాగి బయటకొచ్చాడో అంటూ కామెంట్ చేశారు. సర్పంచ్ అభ్యర్థులు ఓడిపోవడంతో మతి భ్రమించి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని అన్నారు. కేటీఆర్ ను కేసీఆర్ అసమర్థుడిగా భావిస్తున్నారని... కేసీఆర్ ఇప్పుడు బయటకు రావడానికి ఇదే కారణమని చెప్పారు. బీఆర్ఎస్ పూర్తిగా బలహీనపడిందని... పార్టీ కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందని అన్నారు.

# మీరు మీ దేశం కోసం, త్రివర్ణ పతాకం గౌరవం కోసం ఆడుతున్నారు

## ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు



గురువారం జరిగిన సంసద్ ఖేల్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అందరు తల్లిదండ్రులకు ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. 2014కి ముందు క్రీడా విభాగంలో ,జట్టు ఎంపికలో ఉన్న అవకతవకలు ఇప్పుడు ముగిశాయని ఆయన అన్నారు. ఇప్పుడు పేద కుటుంబాల పిల్లలు కూడా కష్టపడి పని చేయడం ప్రతిభ ద్వారా ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారు. యువతలో క్రీడా సంస్కృతి, నాయకత్వ నైపుణ్యాలను ప్రోత్సహించడానికి నిర్వహించిన 'సంసద్ ఖేల్ మహోత్సవ్'లో ప్రధాని మోదీ మాట్లాడుతూ, నగరాల నుంచి గ్రామాల వరకు అన్ని నేపథ్యాల ప్రజలు ఈ ఉత్సవంలో పాల్గొనడం దాని పరిధి, ప్రభావాన్ని చూపుతుందని అన్నారు. 'ఈ ఉత్సవం యువత నిర్మాణం ద్వారా జాతి నిర్మాణం అనే మంత్రానికి బలమైన స్తంభంగా మారుతోంది. సంసద్ క్రీడా ఉత్సవం ద్వారా దేశం వేల మంది ప్రతిభావంతులైన ఆటగాళ్లను పొందుతోంది. క్రీడల నుంచి నేర్చుకునే క్రీడా స్ఫూర్తి, గెలుపు ఓటములకు మించి, సమర్థులైన, క్రమశిక్షణ కలిగిన యువతను సృష్టించడంలో సహాయపడుతుంది. అటువంటి యువతే దేశ భవిష్యత్తును నిర్మిస్తారు. ఈ ఉత్సవం సమాజ ఆలోచనలను మార్చడంలో కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది' అని ప్రధానమంత్రి అన్నారు.' దేశంలోని మారుమూల ప్రాంతాల నుంచి చాలా ఉదాహరణలు వస్తున్నాయి, ఇవి మొత్తం దేశానికి స్ఫూర్తినిస్తున్నాయి. ఎక్కడో ఒక వికలాంగ క్రీడాకారిణి సవాళ్లను చిన్నగా చేయడం ద్వారా ఉన్నత శిఖరాలను తాకుతోంది, ఎక్కడో ఒక మైదానంలో ఒక కుమార్తె తన కలలను నెరవేర్చుకోవడంలో బిజీగా ఉంది. సంసద్ స్పోర్ట్స్ ఫెస్టివల్ అటువంటి క్రీడాకారులకు వారి ప్రతిభను ప్రదర్శించడానికి అవకాశాన్ని కల్పిస్తోంది ' అని ప్రధానమంత్రి మోదీ అన్నారు. గతంలో పిల్లలు ఆడుకోవడానికి తిట్టే సమాజంలో మార్పు ఒక దశాబ్దంలోనే సాధ్యమైందని, ఇప్పుడు తల్లిదండ్రులు ఆటలాడటం జీవితాన్ని నాశనం చేయదని గ్రహించారని, పిల్లలు క్రీడలలో పురోగతి సాధించడం ద్వారా తమ కుటుంబం మాత్రమే కాకుండా మొత్తం గ్రామం ,సమాజం విధిని మార్చగలరని ఆయన అన్నారు.' 2014 కి ముందు క్రీడల పేరుతో క్రీడా శాఖ, జట్టు ఎంపిక మౌలిక సదుపాయాలలో జరిగే అవకతవకలు ఆగిపోయాయి. పేద కుటుంబాల పిల్లలు కూడా చిన్న వయస్సులోనే ఉన్నత స్థాయికి చేరుకోగలరు. నిన్న, పదిహేను-ఇరవై ఏళ్ల యువకుడు క్రీడా మైదానంలో సెంచరీ సాధించాడు; కొందరు 32 బంతుల్లో, మరికొందరు 40 బంతుల్లో. ఇదే వారి బలం. మన యువత ఆడటానికి మరిన్ని వేదికలను అందిస్తున్నాము. ఖేలో ఇండియా, సంసద్ ఖేల్ మహోత్సవ్ వివిధ ఆటల ద్వారా ప్రతిభావంతులను గుర్తిస్తున్నారు. మన దేశంలోని రెండో మూడో టైర్ నగరాల్లో కూడా ప్రపంచ స్థాయి క్రీడా సౌకర్యాలు నిర్మితమవుతున్నాయి.' అని ప్రధానమంత్రి మోదీ అన్నారు. 2014 కి ముందు దేశ క్రీడా బ్జడెట్ ?1,200 కోట్ల కంటే తక్కువగా ఉండేదని, ఇప్పుడు అది ?3,000 కోట్లకు మించి ఉందని ఆయన అన్నారు. ÷ుక్షా (టా÷-గ్గ÷ట్ ఒలింపిక్ పోడియం) పథకం ద్వారా అ÷-లథెట్లకు నెలకు ?25,000 నుంచి ?50,000 వరకు సహాయం అందుతున్నదని ఆయన అన్నారు. 'ఈ ప్రయత్నాలన్నీ ప్రయోజనాలను అందిస్తున్నాయి. గత కొన్ని సంవత్సరాల్లో, మన అ÷-లథెట్లు అసాధారణంగా బాగా రాణించారు. వారు టోక్యో ఒలింపిక్స్‌లో ఏడు పతకాలు, పారిస్ పారాలింపిక్స్‌లో 29 పతకాలు గెలుచుకోవడం ద్వారా ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. ఆసియా క్రీడల్లో 100కి పైగా పతకాలు గెలుచుకోవడం ద్వారా మేము మా అత్యుత్తమ ప్రదర్శనను సాధించాం. భారత అ÷-లథెట్లు ప్రపంచ క్రీడా పటంలో దేశానికి కొత్త గుర్తింపును అందిస్తున్నారు' అని ఆయన అన్నారు. 2030లో అహ్మదాబాద్‌లో కామన్వెల్త్ క్రీడలకు భారతదేశం ఆతిథ్యం ఇస్తుందని, యువతకు గొప్ప వేదికగా నిలిచే భారతదేశాన్ని ప్రపంచం చూస్తుందని ఆయన అన్నారు. 2036లో అతిపెద్ద క్రీడా కార్యక్రమం అయిన ఒలింపిక్స్‌ను నిర్వహించడానికి భారతదేశం కూడా కృషి చేస్తోందని, ప్రస్తుతం 10 లేదా 12 సంవత్సరాల వయస్సు గల యువకులు అక్కడ భారతదేశం ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన అన్నారు. మనం వారిని కనుగొని, పెంపొందించి, జాతీయ వేదికపైకి తీసుకురావాలి, సంసద్ ఖేల్ మహోత్సవ్ ఇందులో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు.'ఈ రోజు నేను దేశంలోని ప్రతి ఆటగాడికి చెప్పాలనుకుంటున్నాను, మీరు మీ విజయం కోసం మాత్రమే ఆడడం లేదు. మీరు మీ దేశం కోసం, త్రివర్ణ పతాక గౌరవం కోసం ఆడుతున్నారని అన్నారు.







# రోహిత్ శర్మ సూపర్ సెంచరీ



స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ విజయ్ హజారే తొలి మ్యాచ్‌లోనే సెంచరీ బాదాడు. సోమవారం జైపుర్ వేదికగా సిక్కింతో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ 62 బంతుల్లోనే శతకం పూర్తి చేశాడు. 237 పరుగుల లక్ష్య ఛేదనలో రోహిత్ శర్మ 94 బంతుల్లో 155 పరుగులు చేశాడు. ఇందులో 18 ఫోర్లు, 9 సిక్స్‌లు ఉన్నాయి. రోహిత్ భారీ సెంచరీతో చెలరేగడంతో ముంబయి 30.3 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి టా÷-గ్గ÷ట్?ను ఛేదించింది. భారీ సెంచరీతో మ్యాచ్ విజయంలో కీలక పాత్ర పోషించిన రోహిత్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డ్ దక్కింది. దాదాపు ఏడేళ్ల తర్వాత విజయ్ హజారే మ్యాచ్?లో బరిలోకి దిగిన హిట్?మ్యాన్ తొలి మ్యాచ్?లోనే సెంచరీ సాధించడం విశేషం. కాగా, రోహిత్ లిస్ట్ ఏ వన్డే కెరీర్?లో అతడికి ఇదే వేగవంతమైన సెంచరీ. ఇంతకుముందు 2023లో బంగ్లాదేశ్‌పై రోహిత్ 63 బంతుల్లో సెంచరీ చేశాడు. ఇప్పటిదాకా లిస్ట్? ఏ కెరీర్?లో 37 సెంచరీలు సాధించాడు. తాజా సెంచరీతో హిట్ మ్యాన్ ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. ఇందులో అంతర్జాతీయ వన్డేల్లో 33 సెంచరీలు కాగా, డొమెస్టిక్ కెరీర్?లో ఇది నాలుగో శతకం. తొలుత బ్యాటింగ్ చేసిన సిక్కిం నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 236 పరుగులు చేసింది. ఇక ఇదే టోర్నీలో రోహిత్ శర్మ ఇంకో మ్యాచ్ కూడా ఆడనున్నాడు. డిసెంబర్ 26న ఉత్తరాఖండ్?తో మ్యాచ్?లో హిట్?మ్యాన్ బరిలో దిగనున్నాడు. రోహిత్ ఈ మ్యాచ్?లో ఆడుతుండడంతో స్టేడియం వద్దకు భారీగా ఫ్యాన్స్ చేరుకున్నారు. 3 వేల మందికి స్టేడియంలో అనుమతి ఇవ్వనున్నట్లు తొలుత నిర్వాహకులు ప్రకటించారు. దీంతో ఏకంగా 10 వేలకుపైగా అభిమానులు మైదానం వద్దకు చేరుకున్నారు. దీంతో స్టేడియం వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అభిమానుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో దాదాపు అందర్నీ లోపలికి అనుమతించారు. రోహిత్ ఆడుతున్నంతసేపూ ఫ్యాన్స్ 'ముంబయి కా రాజా', 'రోహత్, రోహిత్' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.మరోవైపు, ఆంధ్ర- దిల్లీ మ్యాచ్?లో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సైతం శతకంతో అలరించాడు. దిల్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్న విరాట్ (131 పరుగులు, 101 బంతుల్లో) సెంచరీ నమోదు చేశాడు. ఆంధ్ర నిర్దేశించిన 299 పరుగుల ఛేదనలో విరాట్ అదిరే బ్యాటింగ్?తో ఆకట్టుకున్నాడు. మరో బ్యాటర్ నితీశ్ రాణాతో కలిసి రెండో వికెట్?కు 150? పరుగులు జోడించాడు. జట్టు స్కోర్ 274 వద్ద సత్యనారాయణ రాజు బౌలింగ్?లో విరాట్ ఔటయ్యాడు. నితీశ్ రాణా (77 పరుగులు) కూడా హాఫ్ సెంచరీతో రాణించాడు.కాగా, ఈ ఇన్నింగ్స్?తో విరాట్ లిస్ట్? ఏ కెరీర్?లో 16 వేల పరుగుల క్లబ్?లో చేరాడు. ఈ క్రమంలో సచిన్ తెందుల్కర్ తర్వాత ఈ ఘనత సాధించిన భారత రెండో బ్యాటర్?గా నిలిచాడు. 343 మ్యాచ్?ల్లో విరాట్ 16 వేల పరుగుల మైలురాయి అందుకున్నాడు. ఓవరాల్?గా ఈ ఘనత సాధించిన తొమ్మిదో బ్యాటర్?గా నిలిచాడు. విరాట్ కంటే ముందు గ్రాహం గూచ్, గ్రేమ్ హిక్, సచిన్ తెందుల్కర్, కుమార సంగక్కర, సర్ వివియన్ రిచర్డ్స్, రికీ పాంటింగ్, గోర్డాన్ గ్రీనిడ్జ్, సనత్ జయసూర్య ఈ ఫీట్ అందుకున్నారు.

# వైభవ్ సూర్యవంశీపై శశి థరూర్ ప్రశంసలు



4ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఈ ఏడాది అత్యుత్తమ ఫామ్‌లో దూసుకుపోతున్నాడు. 2025 ఐపీఎల్‌లో అరంగేట్రం నుంచి తాజాగా విజయ్ హజారే ట్రోఫీలో భారీ సెంచరీ దాకా అదిరే ఆటతో ఆకట్టుకుంటున్నాడు. బుధవారం విజయ్ హజారేలో అరుణాచల్ ప్రదేశ్?తో జరిగిన మ్యాచ్?లో ఈ బిహారీ కుర్రాడు 190 పరుగులు భారీ ఇన్నింగ్స్?తో సత్తా చాటాడు. దీంతో అతడి ప్రతిభను కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ప్రశంసించారు. వైభవ్?ను ఏకంగా భారత దిగ్గజం సచిన్ తెందూల్కర్‌తో పోల్చారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో థరూర్ ఓ పోస్ట్ షేర్ చేశారు. టీనేజీ వయసులోనే మాజీ క్రికెటర్ సచిన్ తెందూల్కర్ అంతర్జాతీయ అరంగేట్రం చేసిన సందర్భాన్ని థరూర్ గుర్తుచేశారు. అలాగే ఇప్పుడు వైభవ్?ను కూడా టీమ్ఇండియాలోకి తీసుకోవాలని అన్నారు. 'గతంలో 14ఏళ్ల వయసులోనే సచిన్ తెందూల్కర్ క్రికెట్?లో అసాధారణ ప్రదర్శన చేయడం చూశాం. ఆ తర్వాత ఏం జరిగిందో మనందరికీ తెలుసు. అలాగే వైభవ్ సూర్యవంశీని టీమ్ఇండియాలోకి తీసుకునేందుకు ఇంకా ఎందుకు వేచి చూస్తున్నారు' అని శశి థరూర్ ఎక్స్‌లో రాసుకొచ్చారు. వైభవ్‌పై తాజాగా శశి థరూర్ చేసిన వ్యాఖ్యలు అభిమానులను ఆలోచనలో పడేశాయి. కొందరు ఆయన కామెంట్స్?ను సమర్థిస్తూ, అతడికి టీమ్ఇండియాలో అవకాశం ఇస్తే బాగుంటుందని అంటున్నారు. కానీ, ప్రస్తుతం వైభవ్ వయసు 14 ఏళ్ల 273 రోజులు. ఐసీసీ నిబంధనల ప్రకారం, ఇంత చిన్న ఏజ్‌లో ఇంటర్నేషనల్ క్రికెట్‌లోకి ఎంట్రీ ఇవ్వడం కుదరదు.2020లో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ యంగ్ ప్లేయర్ల అరంగేట్రంపై ఓ నిబంధన తీసుకొచ్చింది. అంతర్జాతీయ క్రికెట్?లో అరంగేట్రం చేయాలంటే కనీసం 15 ఏళ్లు నిండి ఉండాల్సిందే. ఈ లెక్కన 2026 మార్చి తర్వాతే వైభవ్? పేరును టీమ్ఇండియాకు పరిశీస్తారు. అయితే ఆ తర్వాత కూడా వెంటనే జాతీయ జట్టులోకి వస్తాడని చెప్పలేం. అప్పటి ప్రదర్శనను దృష్టిలో ఉంచుకొని సెలక్టర్ల ఎంపిక పక్రియ ఉంటుంది. అయితే వైభవ్ ఇదే ఫామ్? కొనసాగిస్తే టీమ్ఇండియా సీనియర్ జట్టులోకి ?వచ్చేందుకు ఎక్కువ సమయం పట్టదేమో!తాజాగా విజయ్ హజారేలో అరుణాచల్ ప్రదేశ్?తో జరిగిన మ్యాచ్?లో వైభవ్ దుమ్ముదులిపాడు. ఏకంగా 16 ఫోర్లు, 15 సిక్స్?లతో 84 బంతుల్లోనే 190 పరుగులు చేశాడు. ఈ క్రమంలోనే లిస్ట్ ం క్రికెట్?లో చరిత్రలో సెంచరీ బాదిన అతిపిన్న వయస్కుడిగా సూర్యవంశీ రికార్డుల్లోకెక్కాడు. ఈ సెంచరీ బాదిన నాటికి వైభవ్ వయసు 14ఏళ్ల 272 రోజులు. అతడు జహూర్ ఇలాహి (15 ఏళ్ల 209 రోజులు, 1986) రికార్డ్‌ను బ్రేక్ చేశాడు.

# శుభ్‌మన్ గిల్ ఈ ఏడాది పరుగుల రారాజు



÷ూరత క్రికెట్ చరిత్రలో 2025 ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుంది. ఛాంపియన్స్ ట్రోఫీ విజయం నుంచి ఆసియా కప్ వరకు టీమిండియా అప్రతిహత విజయాలను అందుకుంది. అయితే ఈ విజయాల్లో కీలక పాత్ర పోషించింది మాత్రం భారత బ్యాటర్ల అద్భుతమైన సెంచరీలే. ముఖ్యంగా సీనియర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను వెనక్కి నెట్టి యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ ఈ ఏడాది పరుగుల రారాజుగా నిలిచాడు.7 సెంచరీలు 2025లో భారత జట్టు తరపున అత్యధిక సెంచరీలు బాదిన ఆటగాడిగా శుభ్‌మన్ గిల్ అగ్రస్థానంలో నిలిచాడు. మూడు ఫార్మాట్లు కలిపి గిల్ మొత్తం 7 సెంచరీలు సాధించాడు. ఇందులో అత్యధికంగా టెస్టుల్లో 5 సెంచరీలు ఉండగా, వన్డేల్లో 2 సెంచరీలు ఉన్నాయి. గిల్ ఈ ఏడాది ఇంగ్లాండ్‌పై ఒకే మ్యాచ్‌లో రెండు సెంచరీలు (161, 269) చేసి రికార్డు సృష్టించాడు.4 సెంచరీలు మరో యువ సంచలనం యశస్వి జైస్వాల్ ఈ ఏడాది 4 సెంచరీలతో రెండో స్థానంలో నిలిచాడు. టెస్టుల్లో తన ఆధిపత్యాన్ని కొనసాగించడమే కాకుండా, 2025లో తన వన్డే కెరీర్‌లో మొదటి సెంచరీని కూడా నమోదు చేయడం విశేషం. 3 సెంచరీలు కింగ్ కోహ్లీ ఈ ఏడాది టీ20ల నుంచి తప్పుకున్నప్పటికీ, వన్డే ఫార్మాట్‌లో తన విశ్వరూపాన్ని చూపించాడు. మొత్తం 3 అంతర్జాతీయ సెంచరీలు (అన్నీ వన్డేలే) సాధించి ఈ జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు. ముఖ్యంగా దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో తన 52వ వన్డే సెంచరీ బాది, సచిన్ టెండూల్కర్ రికార్డును అధిగమించాడు.3 సెంచరీలు గాయం నుంచి కోలుకుని జట్టులోకి వచ్చిన కేఎల్ రాహుల్ కూడా ఈ ఏడాది తన సత్తా చాటాడు. టెస్టులు, వన్డేల్లో కలిపి మొత్తం 3 సెంచరీలు బాది నాలుగో స్థానంలో నిలిచాడు.2 సెంచరీలు టీమిండియా మాజీ సారథి రోహిత్ శర్మ మరియు వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ చెరో 2 సెంచరీలతో ఈ జాబితాలో ఐదో స్థానంలో ఉన్నారు. రోహిత్ తన అనుభవంతో జట్టుకు అండగా నిలవగా, పంత్ టెస్టుల్లో తన దూకుడైన ఆటతీరుతో శతకాలు సాధించాడు.మొత్తానికి 2025 సంవత్సరం శుభ్‌మన్ గిల్ కెరీర్‌లో అత్యుత్తమ ఏడాదిగా నిలిచింది. ఒకవైపు టెస్టులు, వన్డేల్లో పరుగుల వరద పారించిన గిల్, మరోవైపు టీ20 ఫార్మాట్‌లో మాత్రం ఫామ్ లేమితో జట్టులో చోటు కోల్పోయాడు. అయినప్పటికీ, అంతర్జాతీయ క్రికెట్‌లో రోహిత్, విరాట్‌ల వారసుడిగా గిల్ తన ముద్ర వేయడంలో విజయవంతమయ్యాడు.

# చరిత్ర సృష్టించిన విరాట్ కోహ్లీ..

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ చరిత్ర సృష్టించాడు. లిస్ట్ ఏ క్రికెట్‌లో అత్యంత వేగంగా 16 వేల పరుగుల మైలురాయి అందుకున్న తొలి బ్యాటర్‌గా నిలిచాడు. 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో బరిలోకి దిగిన విరాట్ కోహ్లీ.. బుధవారం బెంగళూరులోని బీసీసీఐ సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్స్ మైదానం వేదికగా ఆంధ్ర జట్టుతో జరిగిన తొలి మ్యాచ్‌లో శతకంతో చెలరేగాడు. 101 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్సలతో 131 పరుగులు చేసాడు. ఈ మ్యాచ్ ద్వారా లిస్ట్-ఏ క్రికెట్‌లో కోహ్లీ 16 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. ఇప్పటి వరకు కోహ్లీ 343 లిస్ట్ ఏ మ్యాచ్‌ల్లో 16130 పరుగులు చేశాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో కోహ్లీ కంటే ముందు ఏడుగురు బ్యాటర్లు ఉన్నారు. భారత్ తరఫున 308 అంతర్జాతీయ వన్డేల్లో 53 శతకాలు, 76 హాఫ్ సెంచరీలతో సాయంతో 14,557 పరుగులు చేసిన కోహ్లీ.. ఢిల్లీ తరఫున 14 విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌ల్లో 5 శతకాలు, 3 హాఫ్ సెంచరీలతో సహా 950 పరుగులు చేశాడు. అయితే లిస్ట్-ఏ క్రికెట్‌లో ఇంగ్లండ్‌కు చెందిన గ్రాహం కూచ్ లిస్ట్ ఏ క్రికెట్‌లో టాప్ స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. 1973-97 మధ్య అతను 613 మ్యాచ్‌లు ఆడి 22,211 పరుగులు చేశాడు. ఇంగ్లండ్‌కే చెందిన గ్రాహం హిక్ 651 మ్యాచ్‌ల్లో 22,059 పరుగులతో రెండో స్థానంలో నిలిచాడు. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ 1989-2012 మధ్య 551 లిస్ట్ ఏ మ్యాచ్‌ల్లో 21.999 పరుగులు చేశాడు. ఇందులో 18426 పరుగులు అంతర్జాతీయ వన్డేల్లో సాధించాడు.

# ఇంగ్లాండ్‌తో బాక్సింగ్ డే టెస్ట్ కు ఆసీస్ రెడీ..



యాషెస్ సిరీస్ 2025-26లో ఇప్పటికే 3-0తో ఆధిక్యంలో ఉండి సిరీస్‌ను కైవసం చేసుకున్న ఆస్ట్రేలియా, ఇప్పుడు ఇంగ్లాండ్‌ను క్లీన్ స్వీప్ చేసే దిశగా అడుగులు వేస్తోంది. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా డిసెంబర్ 26 నుంచి ప్రారంభం కానున్న ప్రతిష్ఠాత్మక 'బాక్సింగ్ డే' టెస్టు కోసం ఆస్ట్రేలియా ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. సాధారణంగా స్పిన్నర్లకు సహకరించే చరిత్ర ఉన్న ఎంసీజీ పిచ్‌పై, ఈసారి ఒక్క స్పిన్నర్ కూడా లేకుండా కేవలం నలుగురు స్పెషలిస్ట్ ఫాస్ట్ బౌలర్లతో బరిలోకి దిగాలని నిర్ణయించుకుంది. గాయపడిన స్టార్ స్పిన్నర్ నాథన్ లైయన్ స్థానంలో జట్టులోకి వచ్చిన యువ స్పిన్నర్ టాడ్ మర్ఫీని తుది జట్టు నుంచి తప్పించారు. మెల్‌బోర్న్ పిచ్‌పై ఉన్న పచ్చిక, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్ ఈ నిర్ణయం తీసుకున్నారు.'ప్రస్తుతం పిచ్‌పై ఉన్న గడ్డి చూస్తుంటే ఇది సీమ్ బౌలర్లకు స్వర్గధామంలా కనిపిస్తోంది. అందుకే మేం స్పిన్నర్ లేకుండా నలుగురు పేసర్లతో వెళ్లాలని నిర్ణయించుకున్నాం,' అని స్మిత్ మీడియాకు వెల్లడించారు.సుమారు నాలుగేళ్ల విరామం తర్వాత వెస్టర్న్ ఆస్ట్రేలియా వేగశీలి జై రిచర్డ్సన్ టెస్ట్ క్రికెట్‌లోకి అడుగుపెట్టే అవకాశం ఉంది. అతనితో పాటు స్థానిక హీరో స్కాట్ బోలాండ్, స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ జట్టును ముందుండి నడపనున్నారు. మిగిలిన ఒక స్థానం కోసం మైఖేల్ నెసెర్, బ్రెండన్ డాగెట్ మధ్య పోటీ నెలకొంది. గతంలో అడిలైడ్ టెస్టులో రిచర్డ్సన్ ఐదు వికెట్లతో చెలరేగి ఇంగ్లాండ్‌ను దెబ్బతీసిన సంగతి తెలిసిందే.రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌కు పనిభారం కారణంగా విశ్రాంతినివ్వడంతో, స్టీవ్ స్మిత్ మరోసారి జట్టు పగ్గాలు చేపట్టారు. అడిలైడ్ టెస్టులో రాణించిన వెటరన్ ఓపెనర్ ఖవాజా తన స్థానాన్ని నిలబెట్టుకోగా, జోష్ ఇంగ్లిస్ బెంచ్‌కే పరిమితం కావాల్సి వచ్చింది.ఇప్పటికే సిరీస్ కోల్పోయిన ఇంగ్లాండ్ జట్టుకు మరో ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ గాయం కారణంగా సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు.ఎంసీజీలో ఒక స్పెషలిస్ట్ స్పిన్నర్ లేకుండా ఆస్ట్రేలియా బరిలోకి దిగడం చాలా అరుదు. గతంలో షేన్ వార్న్, నాథన్ లైయన్ ఇక్కడ ఎన్నో అద్భుతాలు చేశారు. అయితే, ప్రస్తుత ఆసీస్ పేస్ అటాక్ ఫామ్ చూస్తుంటే, బజ్‌బాల్ వ్యూహంతో వస్తున్న ఇంగ్లాండ్‌ను మరోసారి ఇబ్బంది పెట్టడం ఖాయంగా కనిపిస్తోంది.

ఆస్ట్రేలియా జట్టు: ట్రావిస్ హెడ్, జేక్ వెదరాల్డ్, మార్నస్ లబుషేన్, స్టీవ్ స్మిత్ (కెప్టెన్), ఉస్మాన్ ఖవాజా, అలెక్స్ కారీ, కామెరాన్ గ్రీన్, మైఖేల్ నెసెర్, మిచెల్ స్టార్క్, జై రిచర్డ్సన్, బ్రెండన్ డాగెట్, స్కాట్ బోలాండ్.

ంగ్లాండ్ జట్టు: జాక్ క్రాలీ, బెన్ డకెట్, జాకబ్ బెథెల్, జో రూట్, హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్ (కెప్టెన్), జమీ స్మిత్, విల్ జాక్స్, గస్ అట్కిన్సన్, బ్రైడన్ కార్స్, జోష్ టంగ్.





# క్షమాపణ చెప్పినా శివాజీని వదలని సింగర్ చిన్మయి

**హీరోయిన్ల దుస్తులపై శివాజీ వివాదాస్పద వ్యాఖ్యలు**

**శివాజీపై ఇప్పటికే విమర్శలు గుప్పించిన చిన్మయి, అనసూయ తదితరులు**

**శివాజీ వివరణతో సమస్య పరిష్కారం కాదని చిన్మయి వ్యాఖ్య**

'దండోరా' సినిమా ఈవెంట్‌లో హీరోయిన్ల దుస్తులపై నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారం మహిళా కమిషన్ దాకా వెళ్లగా, శివాజీ ప్రెస్ మీట్ పెట్టి క్షమాపణలు చెప్పినా వివాదం మాత్రం చల్లారడం లేదు.ఇప్పుడు ఈ అంశంపై సింగర్, సోషల్ యాక్టివిస్ట్ చిన్మయి మరోసారి ఘాటుగా స్పందించారు. శివాజీ వివరణలతో అసలు సమస్య పరిష్కారం కావడం లేదని... శివాజీ వివరణ ఇస్తున్న కొద్దీ, మహిళలకు ఇండస్ట్రీలో రక్షణ లేదనే విషయం మరింత స్పష్టమవుతోందని చెప్పారు.వేధింపులకు అసలు కారణం పురుషుల ప్రవర్తనే అని అంగీకరించడానికి చాలామంది సిద్ధంగా లేరని చిన్మయి తెలిపారు. మహిళల దుస్తులు, ప్రవర్తనపై వేలెత్తి చూపడం నేరాలను పరోక్షంగా ప్రోత్సహించినట్టేనని చెప్పారు. ఇలాంటి వ్యాఖ్యల వల్లే బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని బయటకు చెప్పడానికి భయపడుతున్నారని అన్నారు. ఇది ఒక మహిళ సమస్య మాత్రమే కాదని... మొత్తం మహిళా సమాజానికి సంబంధించిన అంశమని చెప్పారు.


# హారర్ థ్రిల్లర్ సినిమాలో మరోటి ఈషా




నేటి తరం ప్రేక్షకులకు హారర్ థ్రిల్లర్ సినిమాలంటే ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన ఆసక్తి ఉంటుంది. మసూద వంటి హారర్ థ్రిల్లర్ తర్వాత మళ్లీ ఆ రేంజ్‌లో ఒక సినిమా వచ్చింది. ప్రముఖ నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి సమర్పణలో, శ్రీనివాస్ మన్నె దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఈషా'. త్రిగుణ్, అఖిల్ రాజ్, హెబ్బా పటేల్ ప్రధాన పాత్రల్లో నటించగా సిరి హనుమంతు, పృథ్వీరాజ్, మైమ్ మధు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఆర్ఆర్ ధృవన్ సంగీతం అందించాడు. ఈ చిత్రం భారీ అంచనాల మధ్య నేడు

ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సైన్స్ మరియు మూఢనమ్మకాల మధ్య నడిచిందీ కథ.

కల్యాణ్ (త్రిగుణ్), వినయ్ (అఖిల్ రాజ్), నయన (హెబ్బా పటేల్), అపర్ణ (సిరి హనుమంతు) నలుగురు ప్రాణ స్నేహితులు. వీరు దెయ్యాలు, ఆత్మలు లేవని బలంగా నమ్మే హేతువాదులు. అమాయక ప్రజలను భయపెట్టి దోచుకునే నకిలీ బాబాల గుట్టు రట్టు చేయడమే వీరి పని. ఈ క్రమంలోనే ఆంధ్ర ? ఒడిశా సరిహద్దులో అద్భుత శక్తులు ఉన్నాయని ప్రచారం పొందిన ఆది దేవ్ (పృథ్వీరాజ్) అనే బాబా గుట్టురట్టు చేయాలని నిర్ణయించుకుంటారు. అయితే ఆ బాబా ఈ నలుగురికి ఆత్మలు ఉన్నాయని నిరూపిస్తే మీరేం చేస్తారు? అని సవాలు విసురుతాడు. ఆ సవాలును స్వీకరించిన ఈ నలుగురు ఒక భయంకరమైన పాడుబడిన బంగ్లాలో మూడు రోజుల పాటు నివసించడానికి వెళ్తారు. ఆ బంగ్లాలో వారికి ఎదురైన భయానక పరిస్థితులు ఏమిటి? పుణ్యవతి అనే ఆత్మకు, గిరిజనుడైన మైమ్ మధుకు ఉన్న సంబంధం ఏమిటి? చివరకు ఆ మిత్రులు ఆత్మల ఉనికిని అంగీకరించారా లేదా? అన్నదే ఈ చిత్ర కథ. దర్శకుడు శ్రీనివాస్ మన్నె ఎంచుకున్న పాయింట్ కొత్తదేమీ కాకపోయినా, దానిని ప్రజెంట్ చేసిన విధానం ఆకట్టుకుంటుంది. సాధారణంగా హారర్ సినిమాల్లో ఉండే రొటీన్ ఫార్మాట్‌లోనే సినిమా మొదలైనప్పటికీ, ఇంటర్వెల్ ముందు వచ్చే ట్విస్ట్‌లు మరియు విజువల్స్ ప్రేక్షకులను కథలోకి తీసుకువెళ్తాయి. సినిమా మొదటి సగం పాత్రల పరిచయం మరియు బాబా సవాల్‌తో కాస్త నెమ్మదిగా సాగుతుంది. అయితే బంగ్లాలోకి ప్రవేశించిన తర్వాత వచ్చే కొన్ని హారర్ సీన్లు భయపెడతాయి. సెకండాఫ్‌లో అసలు కథ మొదలవుతుంది. ఆత్మలు ఎందుకు కనిపిస్తాయి? మనిషి చనిపోయిన తర్వాత కూడా ఎందుకు ఆత్మగా మిగిలిపోతాడు? అనే అంశాలను ÷-లక్లైమాక్స్‌లో సైంటిఫిక్ అండ్ ఎమోషనల్ పాయింట్‌తో ముడిపెట్టడం బాగుంది. ముఖ్యంగా సెకండ్ పార్ట్ కోసం ఇచ్చిన లీడ్ ఆసక్తిని రేకెత్తిస్తుంది. నటీనటుల ప్రతిభ విషయానికి వస్తే.. త్రిగుణ్ మరియు హెబ్బా పటేల్ తమ అనుభవంతో పాత్రలకు పూర్తి న్యాయం చేయడమే కాకుండా, సీరియస్ సన్నివేశాల్లో తమ నటనతో ప్రేక్షకులను మెప్పించారు. ఈ సినిమాకు అసలైన బలంగా నిలిచిన మైమ్ మధు, గిరిజన పాత్రలో తన ఆహార్యం మరియు నటనతో వెన్నులో వణుకు పుట్టించేలా భయపెట్టారు. బాబా పాత్రలో పృథ్వీరాజ్ చాలా గంభీరంగా కనిపించినప్పటికీ, ఆ పాత్ర నేపథ్యం గురించి కథలో ఇంకాస్త విపులంగా వివరించి ఉంటే బాగుండేదనిపిస్తుంది. ఇక సిరి హనుమంతు మరియు అఖిల్ రాజ్ తమకు కేటాయించిన పరిధి మేరకు చక్కగా నటించి ఆకట్టుకున్నారు. ధృవన్ అందించిన నేపథ్య సంగీతం సినిమా మూడ్‌ను ఎలివేట్ చేసింది. హారర్ సీన్స్‌లో వచ్చే సౌండ్ ఎఫెక్ట్స్ థియేటర్లో మంచి అనుభూతిని ఇస్తాయి. సంతోష్ విజువల్స్ పాడుబడిన బంగ్లాలోని భయానక వాతావరణాన్ని అద్భుతంగా బంధించాయి. దర్శకుడు శ్రీనివాస్ మన్నె పాత కథనే కొత్తగా చెప్పే ప్రయత్నం చేశారు.



# తెలంగాణ పల్లె కథ..దండోరా




కథానాయికల వస్త్రధారణపై నటుడు శివాజీ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల తర్వాత దండోరా సినిమా పేరు మరింతగా ప్రచారమైంది. కులవివక్ష వేళ్లూనుకుపోయిన ఓ ప్లలెటూరు తుళ్లూరు. తెలంగాణకు చెందిన ఆ ఊరిలో అగ్ర కులానికి చెందిన ఓ మోతుబరి శివాజీ (శివాజీ) కూడా వివక్షకు గురవుతాడు. కన్న కొడుకు విష్ణు (నందు)తోనూ ఆయనకు మాటలుండవు. చివరకు ఆయన మరణించినా తన కుల సంఘం శ్మశానవాటికలో అంతిమ సంస్కారాలు చేయడానికి వీల్లేదని పెద్దలు తీర్మానిస్తారు. అసలు అగ్ర కులానికి చెందిన శివాజీని కుల పెద్దలు ఎందుకు బహిష్కరించారు?ఆయనకీ, శ్రీలత (బిందు మాధవి)కీ మధ్య సంబంధం ఏమిటి? ఊరిలో తక్కువ కులానికి చెందిన రవి (రవికృష్ణ) హత్యకు గురైన తర్వాత చోటు

చేసుకున్న పరిణామాలు ఎలాంటివి? శివాజీకి అంతిమ సంస్కారాల నిర్వహణ విషయంలో తలెత్తిన సంఘర్షణపై ఆయన కుటుంబ సభ్యులు, ఊరి సర్పంచ్ (నవదీప్) తీసుకున్న నిర్ణయం ఏమిటి? తదితర విషయాల్ని తెరపై చూడాల్సిందే. సమాజంలో పాతుకుపోయిన వివక్షపై కొత్త దర్శకుడు మురళీకాంత్ 'దండోరా'తో ఓ ప్రయత్నం చేశారు. కుల వివక్ష నేపథ్యాన్ని కొత్త కోణంలో ఆవిష్కరించిన తీరు ఈ సినిమాకు బలం. పరువు హత్యలు.. కుల వివక్ష.. కుల అహంకారంతోనే చోటు చేసుకుంటుంటాయి. మన సినిమాలు చాలావరకూ పరువు హత్యలకు గురైన బాధితుల కోణాన్నే స్పృశించాయి. కానీ, అలాంటి సంఘటనలకు పాల్పడిన కుటుంబాలు కూడా ఛిన్నాభిన్నమవుతాయని, ఆ కుటుంబ సభ్యులకు తీరని వేదననే మిగులుస్తుందని ఇందులో ఆలోచన రేకెత్తించేలా చెప్పారు దర్శకుడు. అగ్ర కులాల్లోని వివక్షనూ, అదే సమయంలో అక్కడ కూడా ఈ జాడ్యాన్ని భరించలేని వ్యక్తిత్వాల్ని, వాళ్ల నిస్సహాయతనీ ఇందులో చూపించిన విధానం చాలా బాగుంది. 2004తో మొదలై, 2019 వరకూ సాగే కథ ఇది. ఆరంభ సన్నివేశాలతోనే దర్శకుడు ప్రేక్షకుల్ని కట్టిపడేశాడు. తాను చెప్పాలనుకున్న విషయంలోని గాఢతని చాటుతూ కథలో లీనం చేయిస్తాడు. శివాజీ పాత్రలోని సంఘర్షణ, మార్పు సినిమాకి ప్రధాన బలం. శివాజీ పాత్ర మార్పు నేపథ్యంలో సన్నివేశాల్లో భావోద్వేగాలు సరిపోలేదనిపిస్తుంది. పతాక సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. ఈ సినిమాకి సంభాషణలే ప్రధాన బలం. 'మన చావు బతుకులు ఊరికి దూరంగానే' అంటూ ఆరంభ సన్నివేశాల్లోని సంభాషణలు మొదలుకొని.. 'చావు అనేది మనిషికి ఇచ్చే ఆఖరి మర్యాద, అది మర్యాదగానే జరగాలి' వంటి సంభాషణలు ఆలోచింపజేసేలా ఉన్నాయి. నటులు ఈ సినిమాపై బలమైన ప్రభావం చూపించారు. ప్రతి ఒక్కరూ అయా పాత్రల్లో జీవించారు. అందుకే చిన్న పాత్ర అయినా సరే, సినిమాపై ప్రత్యేకమైన ముద్ర వేసింది. ముఖ్యంగా శివాజీ ప్రథమార్థంలో చేసిన సందడి ఆయన 'కోర్ట్' సినిమాలో చేసిన మంగపతి పాత్రని గుర్తు చేసింది. ద్వితీయార్థంలో శివాజీ పాత్రలో మార్పు నేపథ్యంలో సన్నివేశాలు ఆయన నటనలో అనుభవాన్ని చాటుతాయి. శ్రీలత పాత్రలో బిందు మాధవి ఒదిగిపోయారు. ఆ పాత్ర ఎంతో హుందాగా ఉంటుంది. సినిమాకి ఆమె నటన ప్రత్యేక ఆకర్షణ. రవికృష్ణ, మణికా ప్రేమజంటగా కనిపించిన తీరు, ఆ పాత్రల్లో వారి అభినయం సహజంగా ఉంది. సర్పంచ్ సాబ్‌గా నవదీప్ చేసిన సందడి మరింతగా ఆకట్టుకుంటుంది. ప్రతి పాత్రనీ దర్శకుడు చాలా బాగా డిజైన్ చేశారు. దర్శకుడు మురళీకాంత్ చెప్పాలనుకున్న విషయాన్ని బలంగా చెప్పారు.

# బైరాన్‌పల్లి పోరాటానికి తెర రూపం

## ఆకట్టుకునేలా ఛాంపియన్ స్టోరీ

ఈ ఏడాది చివరి వారంలో అందరి దృష్టిని ఆకర్షించిన చిత్రాల్లో 'ఛాంపియన్' కూడా ఒకటి. రోషన్ హీరోగా నటించిన ఈ సినిమాని ప్రదీప్ అద్వైతం తెరకెక్కించారు. 'మహానటి', 'సీతారామం' లాంటి విజయాల తర్వాత స్వప్న దత్ నిర్మించారు. చిత్రంలోని పాటలు బాగా పాపులర్ కావడంతో సినిమాపై సర్వత్రా ఆసక్తి న ఎలకొంది. హైదరాబాద్ సంస్థానం నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోతున్న రోజులవి. రజాకార్ల దౌర్జన్యాలకు తెలంగాణ పల్లెలన్నీ చిగురుటాకులా వణికిపోతుండగా.. బైరాన్‌పల్లిలాంటి కొన్ని ఊళ్లు మాత్రం నిజాంకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడుతున్నాయి. అదే సమయంలో సికింద్రాబాద్‌కు చెందిన ఆంగ్లో ఇండియన్ కుర్రాడు మైఖేల్ సి.విలియమ్స్ (రోషన్) ఫుట్‌బాల్ ఆటగాడిగా ఎంతో పేరు తెచ్చుకుంటాడు. తన ప్రతిభతో ఇంగ్లాండ్ మాంచెస్టర్ ఫుట్‌బాల్ క్లబ్‌లో ఆడే అవకాశాన్ని అందుకుంటాడు. కానీ, మైఖేల్ తండ్రి నేపథ్యం కారణంగా తను లీగల్‌గా ఆ దేశానికి వెళ్లే దారులు మూసుకుపోతాయి. దీంతో ఎలాగైనా సరే 20 రోజుల్లో ఇంగ్లాండ్‌కు వెళ్లేందుకు అక్రమ మార్గం ఎంచుకుంటాడు. దానికోసం తను ముందుగా విదేశాల నుంచి వచ్చిన కొన్ని ఆయుధాల్ని అక్రమంగా హైదరాబాద్ నుంచి బీదర్‌కు చేర్చాల్సి ఉంటుంది. మరి ఆ పని పూర్తి చేసి.. ఇంగ్లాండ్ వెళ్లాలనుకున్న మైఖేల్ దారి తప్పి బైరాన్‌పల్లికి వెళ్లడానికి కారణమేంటి?యుద్ధమంటే నచ్చని అతను ఆ ఊరి వాళ్లతో కలిసి రజాకార్లపై పోరుకు ఎందుకు సిద్ధమయ్యాడు?



బైరాన్‌పల్లి గ్రామస్థుల పోరాటాన్ని అణగదొక్కి.. వాళ్లను అంతం చేసేందుకు ఖాసిం రజ్వీ రంగంలోకి దింపిన బాబు దేశ్‌ముఖ్ (సంతోష్ ప్రతాప్)తో మైఖేల్‌కు ఉన్న విరోధం ఏంటి? ఈ కథలో రాజిరెడ్డి (నందమూరి కల్యాణ్ చక్రవర్తి), తాళ్లపూడి చంద్రకళ (అనస్వర రాజన్), సుందరయ్య (మురళీ శర్మ) తదితరుల పాత్రలకున్న ప్రాధాన్యత ఏంటి? అన్నది మిగిలిన కథ. నిజాం నిరంకుశ పాలనలో రజాకార్ల అకృత్యాలకు ఎదురొడ్డి నిలిచి.. వీరోచితంగా పోరాడిన ఘనత, చరిత్ర బైరాన్‌పల్లి సొంతం. అప్పట్లో ఆ ఊరి వాసులు సాగించిన స్ఫూర్తిదాయక పోరాటాన్ని.. ప్రాణత్యాగాలను ఈ 'ఛాంపియన్'తో ఉద్వేగభరితంగా మనసులకు హత్తుకునేలా తెరపై చూపించారు దర్శకుడు ప్రదీప్ అద్వైతం. నిజానికిది తెలిసిన కథైనప్పటికీ.. దాన్ని ఓ ఆటగాడి కోణం నుంచి నడిపిన విధానం.. అందులో ఓ స్వచ్ఛమైన ప్రేమకథను అల్లుకున్న తీరు.. ఆఖరికి వీళ్ల ప్రయాణాన్ని ఎంతో సహజంగా పోరు బాట వైపు నడిపించిన విధానం సినిమాకి కొత్తదనాన్ని ఇచ్చాయి. ఇది విప్లవం, పోరాటం నేపథ్యాలతో ముడిపడినా ఆద్యంతం మంచి భావోద్వేగాలతో నిండిన డ్రామాలా ముందుకు సాగడానికి దర్శకుడు ఎంచుకున్న ఈ పంథానే ప్రధాన కారణం. సర్దార్ వల్లభభాయ్ పటేల్.. హైదరాబాద్ సంస్థానాన్ని దేశంలో విలీనం చేసేందుకు చేసే




ప్రయత్నాలతో సినిమా ఆసక్తికరంగా మొదలవుతుంది. ఆ వెంటనే నిజాం నిరంకుశ పాలనను.. రజాకార్ల దౌర్జన్యాల్ని కళ్లకు కట్టారు. హీరో బైరాన్‌పల్లికి వచ్చాక కథ అక్కడక్కడే తిరుగుతున్న అనుభూతి కలిగినా.. ఆ ఊళ్లోని పాత్రలు.. ముఖ్యంగా తాళ్లపూడి చంద్రకళగా కథానాయిక చేసే అల్లరి అన్నీ ఆకట్టుకుంటాయి. ఎప్పుడైతే బైరాన్‌పల్లిపై రజాకార్ల దాడి జరుగుతుందో.. సరిగ్గా అప్పుడే కథానాయకుడి పాత్రలోని హీరోయిజం బయటకొస్తుంది. తను ఆ ఊరి పోరాటంలో భాగమవ్వడం.. మరోవైపు రజాకార్లకు తను శత్రువుగా మారడం.. ఈ క్రమంలో వచ్చే విరామ సన్నివేశాలతో ద్వితీయార్థంపై అంచనాలు రెట్టింపవు తాయి.హీరో తండ్రి నేపథ్యాన్ని సుభాష్ చంద్రబోస్‌తో ముడిపెట్టిన తీరు ప్రేక్షకులకు మంచి కిక్ ఇస్తుంది. ఇక దాదాపు 20నిమిషాలకు పైగా సాగే పతాక పోరు.. అందులో రజాకార్లపై బైరాన్‌పల్లి వాసులు చేసే వీరోచిత పోరాటం ఆద్యంతం ఉద్విగ్నభరితం, రోమాంచితమే. క్లైమాక్స్‌లో కాస్త సినిమాటిక్ లిబర్టీ తీసుకున్నా.. సినిమాని ముగించిన తీరు హృదయాల్ని బరువెక్కిస్తుంది.మైఖేల్ సి విలియమ్స్ పాత్రలో రోషన్ సహజంగా ఒదిగిపోయాడు. లుక్స్ పరంగా.. నటన పరంగా చాలా కొత్తగా కనిపించాడు. తెలంగాణ యాసను చాలా చక్కగా పట్టుకున్నాడు. యాక్షన్ ఘట్టాల కోసం తను పడిన కష్టం.. అలాగే డ్యాన్సుల్లో తను చూపించిన ఈజ్ తెరపై కనిపిస్తుంది. తాళ్లపూడి చంద్రకళగా అనస్వర నటనా ప్రాధాన్యమున్న పాత్రలో మెరిసింది. రోషన్‌తో ఆమె కెమిస్ట్రీ బాగుంది. రాజిరెడ్డి పాత్రకు నందమూరి కల్యాణ్ చక్రవర్తి పాత్ర నిండుదనాన్ని అద్దింది. సుందరయ్యగా మురళీశర్మ ఆకట్టుకుంటారు. రచ్చరవి, మురళీధర్ గౌడ్, బలగం సంజయ్, అర్చన.. ఇలా తెరపై కనిపించిన పాత్ర ప్రేక్షకుల మదిలో గుర్తుండిపోయేలా ఉంటుంది. ఒక్క సినిమాలో ఇన్ని పాత్రల్ని గుర్తుండిపోయేలా మలచడం మామూలు విషయం కాదు. తెలిసిన కథను దర్శకుడు ప్రదీప్ అద్భుతమైన డ్రామాతో అందరికీ హత్తుకునేలా చూపించగలిగారు. టెక్నికల్‌గా ఇది చాలా బలమైన సినిమా. మిక్కీ జే మేయర్ సంగీతం, నేపథ్య సంగీతం, తోటతరణి ఆర్ట్ వర్క్, మదీ విజువల్స్ ప్రతిదీ దర్శకుడు ఊహకు అద్భుతంగా ప్రాణం పోశాయి.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; Mahesh Babu
RNI No: APTEL/2012/46499Phone No 9849499960,9059696959 Email id: Pallevelugu@gmail.com